ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 29 నవంబరు 2024

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు ఏర్పాటు చేసిన ఆడిట్ శాఖ నవ్వులపాలవుతోంది. మున్సిపాలిటీలు, పంచాయతీలు వంటి స్థానిక సంస్థల్లో ఎప్పటికప్పుడు ఆడిటింగ్ చేస్తూ నిధులు పక్కదారి పట్టకుండా చూడాల్సిన ఈ శాఖ అధికారులు కునుకు వహిస్తున్నారు. ఇటీవల పంచాయతీల్లో వెలుగు చూస్తున్న అవినీతి వ్యవహారాలు ఆడిట్ శాఖ అధికారులు, సిబ్బంది పనితీరును వేలెత్తి చూపిస్తున్నాయి. రూ.లక్షలు ప్రజాధనం దుర్వినియోగమైతే ఆడిట్ శాఖ ఏం చేస్తోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటా పోస్ట్ ఆడిట్ చేస్తున్నా నిధుల దుర్వినియోగాన్ని అడ్డుకోలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా కార్యదర్శులను సస్పెండ్ చేయడం, సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. మరి ఆడిట్ చేసి అంతా బాగుందని రిపోర్టు ఇస్తున్న ఆడిట్ అధికారులు, సిబ్బందిని ఎందుకు బాధ్యులు చేయడంలేదన్న ప్రశ్న తలెత్తుతోంది.



హా...డిట్!

- పంచాయతీల్లో విచ్చలవిడిగా నిధుల దుర్వినియోగం
- లెక్కల్లో మాయ చేస్తూ ప్రజలకు పంగనామం
- ఇటీవల వరుసగా వెలుగుచూస్తున్న అవినీతి లీలలు
- మరి ఆడిట్‌శాఖ ముందే ఎందుకు గుర్తించలేకపోతోంది?
- పోస్ట్ ఆడిట్‌లోనూ అంతా బాగున్నట్లు నివేదికలు
- మామూళ్లతో చూసీచూడనట్లు వదిలేస్తున్న వైనం
- ఆడిట్‌శాఖపై సమీక్షించేవారేరీ?



నెల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో స్థానిక సంస్థలు కీలక భూమిక పోషిస్తుంటాయి. అందుచేతనే కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలు, మున్సిపాలిటీల ఖాతాలకు జమ చేస్తోంది. వీటికి అదనంగా వివిధ పన్నుల రూపంలో స్థానిక సంస్థలకు రూ.కోట్లు జమవుతుంటాయి. ప్రధానంగా పంచాయతీల్లో ఏ అవసరానికి ఎంత మేర నిధులు వినియోగించాలన్నది చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే నిబంధనల ప్రకారం ప్రతిరూపాయిని ఖర్చు చేస్తున్నారా.. లేదా..? అన్నది పరిశీలించే బాధ్యత ఆడిట్ శాఖకు ప్రభుత్వం అప్పగించింది. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిశాక ఖర్చులను, వచ్చిన ఆదాయంతో సరిపోలుస్తూ పోస్ట్ ఆడిట్ చేస్తుంటారు. ఎక్కడైనా అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగి ఉంటే ఈ పోస్ట్ ఆడిట్‌లోనే తేలిపోతుంది. ఆ వివరాలను వెంటనే నివేదిక రూపంలో సదరు పంచాయతీకి అప్పగించాలి. అవకతవకలు జరిగి ఉంటే వెంటనే నోటీసు జారీ చేయాలి. సమాధానం వచ్చాక రికవరీకి నోటీసులు ఇవ్వాలి. కానీ జిల్లాలో ఇంత వరకూ రికవరీ(సర్‌చార్జ్) నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. ఏటా ఆడిట్ చేయడం, ఆ తర్వాత పంచాయతీలకు అప్పగించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● ఎందుకు గుర్తించలేకపోతున్నారు?

ఇటీవల జిల్లాలో అనేక మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. కొందరు సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేశారు. నిధుల దుర్వినియోగం, అభ్యంతరకర ఖర్చులతో జిల్లా ఉన్నతాధికారులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఒక్క కృష్ణపట్నం పంచాయతీలోనే 2021-2023 మధ్య రూ.1.61 కోట్ల నిధులు దుర్వినియోగం జరిగినట్లు, రూ.2.11 కోట్లు అభ్యంతరకరంగా ఖర్చు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి విచారణలో బట్టబయలైంది. పొదల కూరు మండలం ప్రభుగిరిపట్నం పంచాయతీలో రూ.1.78 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసి దుర్వినియోగం చేశారని తేల్చారు. అలానే నెల్లూరు రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో కూడా నిధుల దుర్వినియోగం జరిగిందని నిర్ధారించిన జిల్లా పంచాయతీ అధికారి పలువురు కార్యదర్శులను సస్పెండ్ చేసి సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేశారు. ఇవన్నీ జిల్లా పంచాయతీ అధికారుల విచారణలో బయటపడ్డ అక్రమాలు. మరి ఈ పంచాయతీలన్నిటిలోనూ ఆడిట్ అధికారులు ఆడిటింగ్ జరిపారు. మరి వారు ఎందుకు గుర్తించలేకపోయారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫిర్యాదులు అందిన పంచాయతీల్లోనే జిల్లా పంచాయతీ అధికారులు విచారణలు జరిపారు. మరి అన్ని పంచాయతీల్లో విచారణలు జరిపితే ఇంకెన్ని అక్రమాలు బయటపడతాయోనన్న అనుమానాలు కలుగుతున్నాయి.

● సమీక్షించేవారెవరు?

జిల్లా ఆడిట్ శాఖ ఒకటి ఉందని, అది పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లెక్కలు చూస్తుందన్న విషయం చాలా మంది సామాన్యులకు తెలియదంటే అతిశయోక్తికాదు. సామాన్యులకే కాదు.. జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఆడిట్ శాఖ ఒకటి ఉందన్న విషయం గుర్తుందో.. లేదో.. అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే అన్ని శాఖల పనితీరుపై రెగ్యులర్‌గా సమీక్షించే జిల్లా ఉన్నతాధికారులు.. ఆడిట్ శాఖపై మాత్రం సమీక్షించడం లేదు. నిబంధనల ప్రకారం తరచూ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జరగాలి. అందులో ఆడిట్ శాఖ నివేదికలపై చర్చించాలి. కానీ జిల్లాలో అవేవీ జరగడం లేదు. ఆడిట్ శాఖ బలంగా ఉండి నిబద్ధతతో ఆడిటింగ్ నిర్వహిస్తే పంచాయతీల్లో నిధుల దుర్వినియోగాన్ని పూర్తిగా అరికట్టవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఆ దిశగా జిల్లా ఉన్నతాధికారులు కూడా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వేదాయపాళెం వద్ద రోడ్డు దుస్థితి

నగర రోడ్లు.. నరకానికి నకళ్లు!

6

● హడలిపోతున్న సింహపురీయులు

నెల్లూరు నగర రోడ్లంటే వాహనదారులు హడలిపోతున్నారు. నడిరోడ్డుపై మోకాలిలోతున గుంతలు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల ఇటీవల కురిసిన వర్షాలకు వాటిలో నీళ్లు నిలబడంతో గుంతలోతు తెలియక వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

భయపడొద్దు.. అప్రమత్తంగా ఉండండి!

● కోనలో చిరుత సంచారంపై డీఎఫ్‌వో ప్రకటన

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన పరిసరాల్లో చిరుత సంచారంపై ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) మహ బూబ్‌బాషా తెలిపారు. కోనలోని అటవీ పార్కు సమీపంలో బుధవారం రాత్రి చిరుత తిరుగుతుండగా కారులో ఉన్న కొంతమంది పెంచల స్వామి భక్తులు తమ మొబైల్‌లో వీడియో తీశారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో కోనకు వచ్చే భక్తులతోపాటు పరిసర గ్రామాల్లోని ప్రజల్లో భయాందోళన నెలకొంది. బుధవారం ఉదయం కోనకు చేరుకున్న డీఎఫ్‌వో తమ సిబ్బందితో కలిసి చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరుత సంచారంపై వెంటనే అటవీ,



కోనలో కారు హారన్ విని అడవిలోకి పరుగులు తీస్తున్న చిరుత

బేస్ క్యాంపు, రెగ్యులర్ సిబ్బందిని అప్రమత్తం చేసి అటవీ పరిసరాలన్నీ పరిశీలించినట్లు తెలిపారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయినందున ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే, అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఒంటరిగా తిరగొద్దని విజ్ఞప్తి చేశారు.

- ఖాతాల నవీకరణకు మహిళల పరుగో పరుగు
- బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద బారులు
- సంక్షేమ ఫలాలు అందాలంటే ఖాతా తప్పనిసరి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో అధికారుల కసరత్తు

నా అకౌంట్ అప్‌డేటేనా!?

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు ఖాతాల నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిబంధనల ప్రకారం చాలా మంది లబ్ధిదారులు, తపాలా శాఖ లేదా బ్యాంకులలో వారి ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయలేదు. అలా అనుసం ధానం చేయని 18 సంవత్సరాల వయసు పైబడిన వారిని ప్రభుత్వం గుర్తించి, వారిచేత కొత్తగా బ్యాంకు ఖాతాలు లేదా పోస్టల్ ఖాతాలు తెరిపించి ఆధార్ అనుసంధానం చేయించాలని సచివాల యాలకు ఆదేశాలు జారీ చేసింది. సచివాల యాల వారీగా 18 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వారి వివరాలను సచివాల యాలకు పంపింది. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందనుండటంతో ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఖాతాల నవీకరణ కోసం క్యూలో నిలబడ్డ మహిళలు



పోస్టల్ ఖాతా దరఖాస్తు స్వీకరిస్తున్న పోస్టల్ సిబ్బంది

గుర్తించారు. వారి జాబితాను గ్రామ, వార్డు సచివాలయాలకు పంపించారు. ఈ ఖాతాల నవీకరణకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఆలస్యం కావటంతో పొడిగిస్తూ వస్తున్నారు. తొలుత ఈ నెల 14న నవీకరణకు తుదిగడువుగా ప్రకటించారు. ఆ తరువాత డిసెంబరు 7వ తేదీకి పొడిగించారు. జిల్లాలో 769 సచివాలయాలు ఉండగా, 6300 మంది సిబ్బంది

పోస్టాఫీసులలో ఖాతాల నవీకరణ చేస్తే సంక్షేమ పథకాల లబ్ధి పొందుతారనే ప్రచారం నడుస్తుండటంతో ఈ ఖాతాల నవీకరణ కోసం లబ్ధిదారులు నేరుగా పోస్టల్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. గురువారం నెల్లూరులోని ప్రధాన పోస్టల్ కార్యాలయం వద్ద మహిళలు క్యూకట్టారు. వారిని అదుపు చేయలేక అక్కడున్న అధికారులు నానాతిప్పలు పడ్డారు. పోస్టాఫీసులే కాదు, బ్యాంకులలోనూ ఖాతా ఉంటే నవీకరణ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

● 3,42,295 మంది గుర్తింపు

ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం జిల్లాలో 18 సంవత్సరాల పైబడిన 3,42,295 మంది ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయలేదని ఉన్నారు. ఖాతాల నవీకరణ అంశంలో ప్రజలకు చైతన్యం కొరవడటంతో ఈ నవీకరణ ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. జాబితాలో పేర్కొన్న కొంతమంది కొన్ని సచివాలయాల పరిధిలో అందుబాటులో లేరు. ఉపాధి కోసం కొందరు వలస వెళ్లారు. సచివాలయాల్లో కూడా సిబ్బంది కొరత తదితర కారణాలతో

- మిగతా 6లో

మొదటి స్థానంలో నిలుపుతాం



ఎన్‌పీసీఐ నిబంధనల ప్రకారం ఖాతాల నవీకరణలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతాం. సచివాలయ సిబ్బందితోపాటు మా శాఖ సిబ్బంది కూడా ఈ ఖాతాల నవీకరణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటిదాకా 2,90,508 మంది ఖాతాలను నవీకరణ చేయగా, మిగిలిన 51,787 మందికి కూడా రెండు మూడు రోజుల్లో పూర్తి చేయిస్తాం. బ్యాంకులోనైనా ఖాతా తెరిచి ఆధార్‌తో అనుసంధానం ద్వారా నవీకరణ చేసుకోవచ్చు. బ్యాంకులో ఇప్పటికే ఖాతా కలిగిన వారు ఆధార్ కార్డును ఖాతాకు అనుసంధానం చేయించుకుంటే సరిపోతుంది.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ

గొప్ప సంఘ సంస్కర్త పూలే

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : దేశంలో బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధన, బాలికా విద్య కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీ రావు పూలే అని కలెక్టర్ ఆనం ద్ కొనియాడారు. పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో జ్యోతీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ పూలే అడుగుజాడల్లో పయనిస్తూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జేసీ కార్తీక్, బీసీ సంక్షేమాధి కారి ప్రసూన, అసిస్టెంట్ బీసీ సంక్షేమాధికారి కే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంత ప్రజలకు సురక్షిత నీటిని అందించే లక్ష్యంతో ఒకప్పుడు అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మళ్లీ ఊపిరి పోస్తోంది. గత వైసీపీ సర్కారు బిల్లులు కూడా ఇవ్వకపోవడంతో నాటి కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా ఆపేశాడు. దాదాపు రెండేళ్లపాటు పనులు పూర్తిగా ఆగినా పట్టించుకున్న నాథుడు లేడు.

- నెల్లూరు (జడ్పీ, ఆంధ్రజ్యోతి)


‘సుజలా’ం.. సఫలాం!

- నాటి పథకానికి కూటమి ప్రభుత్వం ఊపిరి
- ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షిత నీరు
- పెండింగ్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు
- ఆయన స్పందించకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేసి సురక్షిత నీటిని ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని మంజూరు చేసింది. ఏఎస్‌పేట, అనంతసాగరం, ఆత్మకూరు, బోగోలు, దగదర్తి, మర్రిపాడు, పొదలకూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం, జలదంకి, వరికుంటపాడు, కలిగిరి, కొండాపురం, వింజమూరు 14 మండలాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. రూ.49.53 కోట్ల నిధులు కూడా మంజూరు అయ్యాయి. బోర్లు, పైపులైన్‌లు, మదర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని పనులను ప్రారంభించారు. 2022 వరకు ఈ పనులు సాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దాదాపు రూ.36 కోట్ల మేర పనులు జరిగినా మరో రూ.14 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు 80 శాతం పనులు పూర్తయినా కొన్ని గ్రామాలకు కూడా తాగునీటి సరఫరా చేయలేకపోతున్నారు.

● డిప్యూటీ సీఎం ఆదేశాలతో..

ఎన్టీఆర్ సుజల స్రవంతి మంచి నీటి పథకం ద్వారా ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అప్పట్లో మంజూరు చేసిన పథకాలన్నిటిపై సమీక్షిస్తున్న ప్రభుత్వం అందులో భాగంగా ఎన్టీఆర్ సుజల స్రవంతిని పూర్తి చేయాలని, బకాయిలు మంజూరు చేస్తామని పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ ఇటీవల తెలిపారు. ఈ మేరకు ఆదేశాలు వెలువడటంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పనులపై దృష్టి సారించారు. ఇప్పటివరకు ఏ మేరకు పనులు జరిగాయి. నిధుల మంజూరు ఎంత? బకాయిలు ఎంత.. పెండింగ్ పనుల పరిస్థితి ఏమిటి? తదితర వివరాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు. పనులను ఆపేసిన గత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. డిసెంబరు 10వ తేదీలోపు వివరణ ఇవ్వాలంటూ ఆ నోటీసులో పేర్కొన్నారు. ఒకవేళ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆయన్ను బ్లాక్‌లిస్టులో పెట్టడంతోపాటు గతంలో మంజూరు చేసిన డిపాజిట్ల సొమ్మును తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్ పనులు చేసినా, చేయకపోయినా మరో కాంట్రాక్టర్ ద్వారానైనా డిసెంబరులో సుజల స్రవంతి పనులు ప్రారంభం కానున్నాయి. త్వరితగతిన వాటిని పూర్తి చేయించి కొద్దినెలల్లోనే 14 మండలాల ప్రజలకు సురక్షితనీరు అందించాలని అధికారులు సిద్ధమయ్యారు.



ఉదయగిరి రూరల్ : కుర్రపల్లి వద్ద ఏర్పాటు చేసిన సుజల స్రవంతి మదర్‌ప్లాంట్ (ఫైల్)

నిధుల కేటాయింపు ఇలా (రూ.కోట్లలో)

మండలం	నిధులు
ఏఎస్‌పేటకు	2.85
అనంతసాగం	3.96
ఆత్మకూరు	3.55
బోగోలు, దగదర్తి	4.18
మర్రిపాడు	4.09
పొదలకూరు	4.59
దుత్తలూరు	3.09
జలదంకి	3.29
కలిగిరి	3.51
కొండాపురం	3.15
సీతారామపురం	3.00
ఉదయగిరి	3.42
వరికుంటపాడు	3.88
వింజమూరు	2.95



చుండి మోడల్ స్కూల్‌లో స్పీడ్ వాక్ ట్రాక్ ఏర్పాటుకు పీఎంశ్రీ పథకం కింద లక్షలు వెచ్చించి నేడు వియోగించకుండా వదిలేశారు. దీంతో మైదానం వినియోగం లేక పిచ్చిమొ క్కలు పెరిగాయి. ఈ ఏడాది మైదానంలో అభివృద్ధికి మరో లక్ష మంజూరు చేసినట్లు సమాచారం. అయితే గత ఏడాది మంజూరు చేసిన నిధులతో వాక్‌ట్రాక్ ఏర్పాటు చేశారే కాని విద్యార్థులు ఒక్కరోజైనా వినియోగించిన దాఖ లాలు లేవు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

వెండినందిపై ఆదిదంపతులు

నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురువారం చిన్న వెండినంది వాహనంపై శివపార్వతులకు ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ముక్కంటి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అనంత రం భస్మాభిషేకం జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల అభిషేకాలు, పూలంగి సేవ, విశేష పూజల అనంతరం ప్రాకారోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలు గా నారపనేని శ్రీనివాసులు, విశాలినీ, కాటంరెడ్డి గోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి వ్యవహరించారు. ఈవో జె శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



కుమార్తెపై ప్రేమ.. పచ్చబొట్టు రూపంలో..





గర్భంలో ఉన్నది ఆడ శిశువని తెలిస్తేనే గర్భస్రావం చేయించే ఈ రోజుల్లో ఆడపిల్ల రూపాన్ని పచ్చబొట్టుతో తన శరీర భాగంపై వేయించుకుని ఎప్పుడూ తనతో ఉన్నట్టుగానే భావించుకుంటున్న ఓ యువ తండ్రి కథ ఇది. పొదల కూరులోని శ్రీనివాస లే అవుట్‌లో ఉంటున్న మారుబోయిన శ్రీహరి, సాయిపవిత్ర దంపతులకు (2017 లో వివాహ మైంది.) తొలుత ఓ కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత 2023లో కుమార్తె జన్మించింది. పాప రుషిత పుట్టిన తర్వాత ఆర్థికం గా, మానసికంగా కలిసొచ్చిందని శ్రీహరి భావించాడు. అంతేగాక 2009లో మరణించిన తన తల్లే కుమార్తె రూపంలో మళ్లీ పుట్టిందని ప్రగాఢంగా నమ్ముతున్నాడు. అందుకోసమే అమ్మపై, పాప మీద తనకున్న ప్రేమను పచ్చబొట్టు రూపంలో కుడిచేతిపై వేయించుకున్నాడు. ఇందుకుగాను శ్రీహరికి రూ.4వేలు ఖర్చు అయ్యింది. ఆ పచ్చబొట్టు చూస్తుంటే పాప, తన అమ్మ తనతో ఉన్నట్టే ఉంటుందని శ్రీహరి చెబుతున్నాడు. ఆడపిల్లలంటే సృష్టికర్తలని, వారిని కని పులిపిల్లల పెంచాలని అంటున్నాడు.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

గజ గజ!



ఆత్మకూరు: ముంబయి హైవేను కప్పేసిన మంచు పరదా

- జిల్లాపై మంచు దుప్పటి
- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. వణికిపోతున్న జనం

ఆత్మకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలితీవ్రత పెరగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచే చలిగాలులు పెరుగుతుండటంతో వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు. పల్లెల్లో కొందరైతే ఇళ్ల ముందు మంటలు వేసుకుని చలి కాచుకుంటున్నారు. మరికొందరు మంచం పక్కన నిప్పుల కుంపటి ఏర్పాటు చేసుకుని వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాబోవు రోజుల్లో చలి మరింత తీవ్రంగా ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

● నైట్ షెల్టర్లు అవసరం

చీకటిపడగానే చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్ల పక్కన, బస్టాండ్లలో తలదాచుకునే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నెల్లూరు నగరంతో పాటు కావలి, ఆత్మకూరు, కందుకూరు తదితర పట్టణాల్లోని రోడ్ల పక్కన, బస్, రైల్వే స్టేషన్లలో యాచకులు, అనాథలు జీవిస్తు న్నారు. ఇలాంటి అభాగ్యులకు చలి కాలంలో నైట్ షెల్టర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



నెల్లూరులో పొగమంచును చీల్చుకుని వస్తున్న రైలు





ఉదయగిరిలో రోడ్డుపై నిద్రిస్తున్న యాచకులు

● రహదారులను కప్పేస్తూ..

జిల్లాలో రహదారులను మంచు దుప్పటి కప్పేస్తోంది. పొగమంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొందరు మంచు తగ్గే వరకు వాహనాలను రోడ్డు పక్కన ఆపేస్తుండగా మరి కొందరు అలాగే ముందుకు సాగి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

● వ్యాధులు ప్రబలే అవకాశం

చలికాలం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు ఎక్కువగా రోగాల బారిన పడుతున్నారు. చల్లదనం పెరగడంతో శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చిన్నారులు జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. వృద్ధులలో అయితే రక్తప్రసరణ తగ్గి కాళ్లు, చేతులు చచ్చుబడే ప్రమాదం ఉంది. సహజంగా నవంబరు నుంచి జనవరి వరకు చలితీవ్రత వల్ల విషజ్వరాలు విజృంభిస్తాయి. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా మంచు ప్రజలతోపాటు పంటలకు కూడా హాని చేస్తుంది. తెగుళ్లు విస్తరిస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి

చలికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత వ్యాధిగ్రస్థులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మధుమేహ బాధితుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఉంటుంది. దానివల్ల పక్షవాతం, ఇతర వ్యాధులు వెంటనే సోకే ప్రమాదం ఉంది. ఉబ్బసం ఉన్న వారికి చలికాలం చేటు తెస్తుంది. వీలైనంత వరకు వృద్ధులు, పిల్లలు మంచుకు దూరంగా ఉండటం మంచిది.

- డాక్టర్ బాలాజి, శ్వాసకోశ వ్యాధి నిపుణుడు, జిల్లా ప్రభుత్వ వైద్యశాల, ఆత్మకూరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చాలి: కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను బాల్య వివాహాల రహితంగా మార్చాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జిల్లా స్త్రీశిశుసంక్షేమశాఖ రూపొందించిన కిశోరి వికాసం కార్యక్రమ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గ్రామ, మండల స్థాయిలో బాల్య వివా హాల నిరోధానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కిశోరి వికాసం కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని యంత్రాంగానికి సూచించారు. ఈ కార్యక్రమంపై జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి ఒక బృందం ఏర్పాటైందని, వారిచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామ, మం డల స్థాయిలో కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణా ధికారి సురేష్, డీఎంహెచ్‌వో పెంచలయ్య, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల దత్తతలో జాప్యం వద్దు : కలెక్టర్

జిల్లాలో అనాథ పిల్లల దత్తత ప్రక్రియలో జాప్యం లేకుండా త్వరగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్నీ అనాథ బాలల వసతి గృహాలు జేజేయాక్టు-2015 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని స్పష్టం చేశారు. లేకపోతే చట్టపర మైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్ కార్డు లేని అనాథ పిల్లలకు విద్యాశాఖ, ఐటీడీఏ సహకారంతో ఆధార్‌కార్డులు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్ ఆనంద్ హెచ్చరిక

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో లింగనిర్ధారణ నిషేధిత కమిటీతో సమీక్ష నిర్వహించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం నిబంధనల మేరకే స్కా నింగ్ కేంద్రాలను నిర్వహించాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎమ్మారై, ఎకో స్కానింగ్ నిర్వాహకులు తప్పని సరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్ ముమ్మరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కాగా, స్కానింగ్ కేంద్రాల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కమిటీ ఆమో దించింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచ లయ్య, మహిళా స్టేషన్ డీఎస్పీ రామారావు, ఎన్జీవో కవితారెడ్డి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

రైతులు బీమా పథకాల్లో చేరాలి: కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి పంటలు సాగుచేస్తున్న ప్రతి రైతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరిం చిన వాతావరణ ఆధారిత బీమా పథకాల్లో చేరాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో గురువారం పంటల బీమా పథకంపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ తుఫాన్లు, కరువు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి తగ్గి నష్టపోయిన రైతులకు బీమా పథకాలతో ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. తక్కువ ప్రీమియం చెల్లించి ఎక్కువ బీమా పొందే అవకాశం ఉందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి ప్రతి రైతు బీమా చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి, మినుము, శనగ, పెసర, వేరుశనగ తదితర పంటలకు ప్రీమియం ఎకరాకు వరుసగా రూ.168, రూ.38, రూ.56, రూ.36, రూ.60 మాత్రమేనని చెప్పారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, పీఏసీ ఎస్‌లలో ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసా యాధికారి పీ సత్యవాణి, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, సీపీవో రాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ దేశ్‌నాయక్, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



చేపల విక్రయానికి ఉపయోగించే త్రాసును తనిఖీ చేస్తున్న అధికారులు

తూకాల్లో అన్నీ తప్పులే !

- విజిలెన్స్, కార్పొరేషన్, తూనికలు కొలతల శాఖల దాడులు
- చేపలు, మాంసం విక్రయాల్లో తేడాల గుర్తింపు

నెల్లూరు(క్రైం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మాంసాహార ప్రియులు ఎక్కువ. వారానికి మూడు రోజులు చేపలు, రొయ్యలు, చికెన్, మటన్.. వంటివి వండుకుని తింటుంటారు. ఈ క్రమంలో చేపల మార్కెట్లతోపాటు చికెన్, మటన్ స్టాల్స్, రోడ్లపై ఏర్పాటు చేసే చేపల దుకాణాల్లో వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే ఈ వ్యాపారంలో తూకాల్లో మోసం జరుగుతోందని అధికారులు గుర్తించారు. నెల్లూరులోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, కార్పొరేషన్, తూనికలు కొలతల శాఖల అధికారులు గురువారం సంయుక్తంగా ఏకకాలంలో తనిఖీలు చేశారు. తూకాల్లో 100 గ్రాములకుపైగా వ్యత్యాసం ఉందని గుర్తించారు. నగరంలోని డైకాస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు, హరనాథపురం, ముత్తుకూరు గేటు ప్రాంతాల్లో మూడు శాఖల అధికారులు నిర్వహించిన తనిఖీల్లో తూకాలు సక్రమంగా లేవని, అనేక దుకాణాల్లో శుభ్రత పాటించడం లేదని నిర్ధారించారు. పది దుకాణాలపై కేసులు నమోదు చేసి వాటి నిర్వాహకులకు అపరాధ రుసుము విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ రామలింగాపురంలోని జాఫర్‌బాషా చికెన్ సెంటర్‌కు కార్పొరేషన్ శానిటేషన్, తూనికలు కొలతల శాఖల అధికారులు రూ.15 వేలు అపరాధ రుసుము, పొదలకూరు రోడ్డులోని ఎస్‌ఎస్ చికెన్ సెంటర్‌కు రూ.15 వేలు, మరో 8 దుకాణాలకు రూ. 500 చొప్పున ఫైన్ వేసినట్లు తెలిపారు.

పంచాయతీరాజ్ ఏఈకి షోకాజ్ నోటీసు

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజుకు జిల్లా పంచాయతీ అధికారులు గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండలంలో అభివృద్ధి పనులకు సహకరించకుండా ప్రతి పనికి ముందస్తుగానే పర్సంటేజీలు డిమాండ్ చేస్తున్నట్లు ఉదయగిరి వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆ శాఖ ఉన్నతాధికారులను విచారణకు ఆదేశించారు. అధికారుల విచారణలో ఏఈ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గుర్తించి మండలంలోని ఐదు పంచాయతీలను తప్పించి, వింజమూరు ఏఈ తిరుమలయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. విధుల్లో నిర్లక్ష్యానికి గల కారణాలు తెలుపుతూ పది రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు చేపడతామని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

నగర రోడ్లు.. నరకానికి నకళ్లు!

నవ్విపోదురుగాక మాకేటి.. అన్నట్లుగా మారాయి నగర రోడ్లు. రాష్ట్రస్థాయిలో ఎంతో గుర్తింపు ఉండి.. సింహపురి కేంద్రంగా విరాజిల్లుతున్న నెల్లూరు నగర రోడ్లు నరకానికి నకళ్లుగా మారిపోతున్నాయి. ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికార యంత్రాంగం పూర్తిగా విస్మరించడంతో నడిరోడ్లపైనే మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్లపై తిరుగుతున్న వాహనదారులు, ప్రజలు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న గుంతల్లో నీళ్లు నిలిచాయి. ఇవి తెలియక వాహనదారులు గుంతల్లో దిగుతూ బోర్ల పడుతున్నారు. నగరంలోని మినీ బైపాస్, వేదాయపాలెం, డైకాస్ రోడ్డు, పొదలకూరు రోడ్డు, కేవీఆర్ అండర్ బ్రిడ్జి రోడ్డు, నవాబుపేట నుంచి మైపాడుకు వెళ్లే రోడ్డు, స్టోన్‌హౌస్‌పేటలోని ఇందిరాగాంధీ విగ్రహం రోడ్డు, ఆత్మకూరు బస్టాండు నుంచి ఇరుగాళలమ్మ సెంటర్‌కు వెళ్లే రోడ్డు ఇలా చెప్పుకుంటూపోతే నగర మొత్తం గతుకుల రోడ్లే అగుపిస్తాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి, రోడ్లకు మరమ్మతు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



పొదలకూరు రోడ్డు దుస్థితి



ఫోన్ సంభాషణ సరే.. కింద పడితే ఆసుపత్రికే..



వామ్మో ఎంతపెద్ద గుంతనో..



వేదాయపాళెం వద్ద..



అపోలో ఆసుపత్రికి వెళ్లే రోడ్డులో..

నా అకౌంట్ అప్‌డేటేనా!?

(5వ పేజీ తరువాయి)

ఖాతాల నవీకరణకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

● 9వ స్థానంలో జిల్లా

ఖాతాల నవీకరణలో రాష్ట్రస్థాయిలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 3,42,295 మంది నవీకరణ చేసుకోవాల్సి ఉండగా 2,90,508 మంది ఖాతాల నవీకరణ (84.87 శాతం) చేసుకున్నారు. మండలాల వారీగా చూస్తే వలేటివారిపాలెం ఖాతాల నవీకరణలో ప్రథమ స్థానంలో (98.81 శాతం) ఉంది. చివరి స్థానంలో కలువాయి (63.82 శాతం) ఉంది. 98.53 శాతంతో ముత్తుకూరు 2వ స్థానం, 97.51 శాతంతో గుడ్లూరు 3వ స్థానంలో ఉంది.

వైభవంగా వెంగమాంబ పల్లకీ సేవ



దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరం టాలమ్మ అమ్మవారికి పల్లకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన కార్యక్ర మాలు నిర్వహించి అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మైనింగ్ తవ్వకాలు జరిపితే

ఆత్మహత్యలే శరణ్యం

● జంగంరెడ్డిపల్లివాసుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

తమ గ్రామంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతులిస్తే మూకుమ్మడిగా ఆత్మహత్యలు చేసుకుంటామని జంగంరెడ్డిపల్లి గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సర్వే నెంబరు 233లోని సుమారు 40ఎకరాల కొండ ప్రాంతంలో ఇటీవల యంత్రాలతో పనులు చేపట్టేందుకు వెళ్లిన వ్యాపారులను అడ్డుకొన్న గ్రామస్థులు సర్పంచుతో సహా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అక్కడ పనులు చేపట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. బుధవారం రాత్రి కొంతమంది గ్రామస్థులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి ప్రభుత్వ అనుమతితో గురువారం వస్తున్న వ్యాపారులను అడ్డుకుంటే చర్యలు చేపడతామని బెదిరించారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేపట్టేందుకు అవకాశం కల్పించకూడదని నిర్ణయించుకున్న గ్రామస్థులు వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా రహదారికి అడ్డుగా బైఠాయించి ఆందోళన చేశారు. కొండను ఆనుకొనే నివాసాలు, ఆలయాలు, పాఠశాల ఉండడంతో మైనింగ్ పనులు చేపట్టిన తరుణంలో తమతో సహా మూగజీవాలు, పిల్లల ప్రాణాలకు ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తామంతా కార్యాలయాల వద్ద ఆత్మహత్య చేసుకుంటామే తప్ప పనులు చేపట్టేందుకు ఒప్పుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

- వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)

ఈ ప్రయాణం

సురక్షితమేనా..!?



ద్విచక్రవాహనంపై ఐదుగురి ప్రయాణం

ఒకరిద్దరు కాదు.. ఏకంగా ఐదుగురు ఒకే బైక్‌లో ప్రయాణిస్తున్నారు. వీరిని చూసిన ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఓ వైపు స్కూలు టైం, మరోవైపు ఏవేవో ఇతర పనులు.. వారిని ఇలాంటి ప్రయాణానికి పురిగొల్పాయి. ఏదైనా జరగరానిది జరిగితే అందుకు బాధ్యులెవరో.. ఆలోచించాలి. జొన్నవాడ నుంచి నరసింహకొండ వైపు గురువారం వీరు ఇలా ప్రయాణించడం ఆంధ్రజ్యోతి కంటపడింది.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)

కుటుంబ సభ్యులకు బాలిక అప్పగింత

● ఫలించిన పోలీసుల శ్రమ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం అదృశ్యమైన బాలికను గంటల వ్యవధిలో కనిపెట్టి ఆత్మకూరు పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించి ప్రశంసలు అందుకున్నారు. ఆత్మకూరు డీఎస్పీ కె వేణుగోపాల్ తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న షేక్ షమీమ్ కనిపించడం లేదని బుధవారం సాయంత్రం తమకు ఫిర్యాదు అందిందన్నారు. విచారణ జరపగా ఆ బాలిక సొంతవూరు కావలి అని, తల్లి చనిపోవడంతో ఆత్మకూరులోని తన మేనమామ ఇంట్లో ఉండి చదువుకుంటోందని, చదువులో ఆసక్తి తగ్గడంతో కుటుంబ సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు మందలించడంతో మనస్తాపం చెంది పాఠశాల నుంచి వెళ్లిపోయిందని తెలిసిందన్నారు. ఈ క్రమంలో సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, పోలీసులు నాలుగు టీములుగా ఏర్పడి రాత్రంతా ఆత్మకూరు, నెల్లూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టడంతో బాలిక ఉదయగిరిలో ఉన్నట్లు గుర్తించారన్నారు. బాలికను ఓదార్చి గురువారం కుటుంబసభ్యులకు అప్పగించామని వివరించారు. గంటల వ్యవధిలో ఎంతో శ్రమించి బాలికను గుర్తించిన సీఐ గంగాధర్, ఎస్‌ఐ షేక్ జిలాని, పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీకి అస్వస్థత

సంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తున్న ఓ వ్యవసాయ కూలీని గురువారం ఉదయం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన కొందరు కూలీలు సంగం మండలంలో వ్యవసాయ పనులకు వచ్చారు. అందులో భాగంగా మర్రిపాడు గ్రామంలో ఓ రైతుకు చెందిన పొలంలో నారుమళ్లు పీకేందుకు వెళ్లగా అందులో ఓ కూలీని నాగుపాము కాటువేసింది. వెంటనే స్థానిక కూలీలు అతడిని ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఆరోగ్యం కుదుటపడినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

● రూ. 6 లక్షల నగదు రికవరీ



అరెస్టు చేసిన నిందితుడితో సీఐ రవినాయక్, ఎస్‌ఐలు

ముత్తుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసై చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణపట్నం సీఐ రవినాయక్ నిందితుడి వివరాలను వెల్లడించారు. పిడతాపోలూరుకి చెందిన నెల్లూరు వెంకటరమణయ్య డబ్బుల కోసం చోరీలకు అలవాటుపడ్డాడు. ఐదు రోజుల కిందట పిడతాపోలూరు కట్టకిందవడ్డిపాలెంకు చెందిన నెల్లూరు పద్మ ఇంటిలో రూ.6లక్షల నగదు కాజేశాడు. ఈ విషయమై ముత్తుకూరు ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి, కృష్ణపట్నం ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి తమ సిబ్బందితో విచారణ చేపట్టారు. బుధవారం నిందితుడు పిడతాపోలూరు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నాడన్న సమాచారం తెలియడంతో అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.6లక్షలను రికవరీ చేశారు. కేసును త్వరగా ఛేదించడంలో కృషి చేసిన ఎస్‌ఐలు విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు హెడ్‌కానిస్టేబుళ్లు సుధాకర్, సుబ్బారావు, కానిస్టేబుళ్లు రమణ, నాగార్జున, వేణులను సీఐ రవినాయక్ అభినందించి, రివార్డులు అందజేశారు.

10 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 28: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 10 ఎర్రచందనం దుంగలను సింగనపల్లి అటవీ ప్రాంతంలో గురువారం ఉదయం అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు డీఆర్వో నాగయ్య తమ సిబ్బందితో అడవిలో కూంబింగ్ నిర్వహించి 3లక్షల విలువ చేసే దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆత్మకూరు రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు డీఆర్వో తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై విచారణ

● ఎమ్మెల్యే ఫిర్యాదుతో కదిలిన అధికారులు



యంత్రాలతో కొలతలు తీస్తున్న విజిలెన్సు అధికారులు

వెంకటాచలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ దాసుకండ్రిగ, ఇడి మేపల్లి, సర్వేపల్లి, ఈదగాలి, శ్రీకాంత్ కాలనీ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన అక్రమ గ్రావెల్ తవ్వకాలపై గురువారం విజిలెన్సు విచారణ చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెంకటాచలం మండలంలో జరిగిన గ్రావెల్ తవ్వకాలపై సీఎం చంద్రబాబుకి ఫిర్యాదుచేశారు. గతంలో సోమిరెడ్డి అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. చంద్రబాబు ఆదేశాలతో జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలను, మైనింగ్, విజిలెన్సు, రెవెన్యూ అధికారులు యంత్ర పరికరాలతో కొలతలువేసి క్షుణ్ణంగా పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణకు హాజరైన అధికారులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	111
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7339
వెండి కిలో ధర	రూ. 90,000
వెండి ఒక గ్రాము	రూ.93.00

● 'డ్వాక్రా'లో ఎస్సీ మహిళలకు రుణాలు
● రూ. లక్ష నుంచి 3 లక్షల వరకు పరిమితి
● రూ.50 వేల రాయితీ
● నాలుగు రకాల వ్యాపారాలకు అవకాశం

'పీఎం అజయ్'తో

అభయం



డ్వాక్రా సంఘం పొదుపు మహిళలు (ఫైల్)

సంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ మహిళల ఆర్థిక అభ్యున్నతికి రాయితీ రుణాలు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన (పీఎం అజయ్) పథకం కింద రూ.50 వేల రాయితీతో రుణాలు మంజూరు చేస్తారు. ఏపీ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలు రుణాలు పొందేలా అవకాశం కల్పించారు. గత వైసీపీ ప్రభుత్వంలో వడ్డీలేని రుణాలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో రాయితీని జత కలిపారు. రాయతీని మినహాయించి మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులు వడ్డీ లేకుండా చెల్లించుకునే వెసులుబాటు ఇచ్చారు.

● 99,234 మహిళలకు అవకాశం

జిల్లాలో సుమారు 39,066 డ్వాక్రా మహిళా సంఘాలు ఉండగా, సుమారు 4,04,399 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 9,700 ఎస్సీ డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 99,234 మంది సభ్యులున్నారు. ఏ గ్రేడ్ సంఘాల్లోని (నెలవారీ పొదుపు సక్రమంగా చెల్లిస్తూ రుణ రికవరీలు బాగున్న సంఘాలు) వారికి మండలాల వారీగా నిర్ణయించిన యూనిట్ల ప్రకారం రుణాలు ఇవ్వనున్నారు.

● రుణాలు ఎలా పొందాలి..

ఎస్సీ కుటుంబానికి చెందిన 60 ఏళ్లలోపు వయసు కలిగి డ్వాక్రా సంఘాల్లో సభ్యులై ఉండాలి. ప్రతి యూనిట్‌కు రూ.1లక్ష నుంచి మూడు లక్షల వరకు రుణం పొందవచ్చు. ఇందులో రూ.50 వేలు రాయితీ ఉంటుంది. లబ్ధిదారులు తొలుత పది శాతం మొత్తాన్ని సీఈవో సెర్ప్ ఉన్నతి వారి రికవరీ ఖాతాకు జమ చేయాలి. ఆ తరువాత యూనిట్ విలువ (కాస్ట్)ను బట్టి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేస్తారు.

● నాలుగు రకాల వ్యాపారాలు

నాలుగు రకాల వ్యాపారాల నిమిత్తం పీఎం అజయ్ పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. మొదటిది వ్యవసాయ రంగం. ఇందులో కూరగాయలు, నర్సరీ వంటి వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టుకోవచ్చు. రెండవది సేవా రంగం. ఇందులో ఆటో రిక్షా, ఫోటో స్టూడియో, ట్రావెల్ ఏజెన్సీ, జెరాక్స్ సెంటర్ పెట్టుకోవచ్చు. మూడవదిగా సూక్ష్మ వ్యాపారం కిరాణా, పూలు విక్రయాలు చేయవచ్చు. నాల్గవది చిన్నతరహాకు చెందిన పరిశ్రమలు కొవ్వొత్తుల ఉత్పత్తి, కారం పొడి తయారీ, వాటర్ ప్లాంట్, కుండల తయారీ వ్యాపారాలతో రాయితీ రుణాలు పొందవచ్చు.

మార్చిలోగా 35వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

● గృహాల కోసం పీఎంఏవైకి దరఖాస్తు చేసుకోండి ● హౌసింగ్ పీడీ వేణుగోపాల్



కాగితాలపూరులో ఇళ్ల నాణ్యతపై కాంట్రాక్టరుతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

మనుబోలు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వచ్చేఏడాది మార్చి నాటికి జిల్లాలో 35వేల ఇళ్లు పూర్తిచేయించాలన్నది లక్ష్యంగా పని చేస్తున్నామని గృహనిర్మాణశాఖ పీడీ టీ వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని కాగితాలపూరు లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్లనిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలాల్లో ఇళ్లనిర్మాణాల వేగం పెంచేందుకు ఇటు ఏఈలతో, ఇటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో రెండురోజులకోసారి సమీక్షలు చేస్తున్నామన్నారు. సిమెంట్, ఇసుక బిల్లులకు ఎలాంటి ఢోకా లేదన్నారు. నిర్మాణాల్లో నాణ్యత దెబ్బతినకుండా చూడాలన్నారు. స్థలం ఉండి, ఇల్లు మంజూరుకాని వారంతా పీఎంఏవైకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు గడువును మరో పదిరోజుల వరకు పొడిగించామన్నారు. మండలంలో సుమారుగా 1200ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు. అనంతరం వీరంపల్లిలోని లింగారెడ్డిపల్లి గిరిజనుల ఇళ్లనిర్మాణాలపై విచారణ చేపట్టారు. నిర్మాణాలకు మించి కాంట్రాక్టరుకు బిల్లులు అదనంగా ఇచ్చినట్లు గుర్తించినట్లు చెప్పారు. 28ఇళ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరిగి కాంట్రాక్టరుతో నిర్మాణాలు చేయడమా.. లేక అతడిపై కేసులు నమోదుచేయడమా త్వరలోనే చెబుతామన్నారు. మనుబోలులోని ఆగిన గిరిజనుల ఇళ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ. భాస్కర్‌రావు, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

● జాయింట్ కలెక్టర్ కార్తీక్



రీసర్వే సమస్యలపై మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వే సందర్భంగా నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తహసీల్దార్లు, సర్వేయర్లను ఆదేశించారు. ఆ దరఖాస్తులపై కలెక్టరేట్ తిక్కన భవన్‌లో గురువారం సమీక్ష జరిగింది. జేసీ మాట్లాడుతూ రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదు కావటం, విస్తీర్ణం తేడా రావటం వంటి సమస్యలు వచ్చాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎఫ్‌లైన్ సర్వే, పట్టాసబ్ డివిజన్ దరఖాస్తులు సర్వేయర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు. చెరువుల ఆక్రమణ వివరాలు సేకరించి తొలగింపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటిపన్ను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీవో అనూష, అధికారులు పాల్గొన్నారు.

మేకల కాపరి హత్య

ఆపై మేకలతో పరారీ
కొండాపురం మండలం గానుగపెంటలో ఘటన



తిరుపాలు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొండాపురం, నవంబరు 28: మండలంలోని గాను గ పెంటకు చెందిన మేకల కాపరి బంకా తిరుపాలు (55)అనే వ్యక్తిని సంగం మండలం కరుణవాయికి చెందిన గురునాదం మాల్యాద్రి అనే వ్యక్తి బుధవారం రాత్రి హత్య చేసి మేకలతో పరారీ అయ్యాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాను పశువులను మేపుతాను అంటూ రెండు నెలల కిందట గురునాదం మాల్యాద్రి గానుగపెంటకు వచ్చాడు. రైతులు కొంతమంది పశువులను చూపి మేపేందుకు పంపారు. నెలరోజులు పశువులను మోపాడు. అనంతరం వెళ్లడం మానేశాడు. బుధ వారం ఉదయం మేకలు మేపుకునేందుకు గ్రామానికి చెందిన బంకా తిరుపాలు తన 25మేకలతో సమీప అటవీప్రాంతానికి వెళ్లాడు. ప్రాంతంపై అవగాహన ఉన్న గురునాదం ఒంటరిగా ఉన్న బంకా తిరుపాలును గమనించి అతని మీద కత్తితో దాడి చేసి గొంతుకు ఇనుపతీగ చుట్టి చంపేశాడు. మృతి చెందిన తర్వాత తిరుపాలు కనబడకుండా చెట్లకొమ్మలు అతనిపై వేసి అక్కడ నుండి మేకలను తోలుకుపోయాడు. అందులోని రెండు మేకలు తప్పించుకొని సాయంత్రానికి ఇంటికి తిరిగి వచ్చాయి. తిరుపాలు రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పలుచోట్ల వెతికి చుట్టపక్కల గ్రామాల వారిని అడిగినా ఆచూకీ తెలియలేదు. తెల్లవారు జామున అటవీప్రాంతంలో శవంగా కన్పించడంతో భార్య ధనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకట నారాయణ, కొండాపురం ఎస్సై వెంకటరావులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా మేకలను అపహరించిన మాల్యాద్రి గురువారం కలిగిరి మండలంలోని చిన్న అన్నలూరు పంచాయతీలోని కొట్టాలులో ఒక రైతుకు రెండు మేకలను విక్రయించాడు. ఇతని మీద అనుమానంతో గ్రామస్థులు వీడియో రికార్డు చేశారు. మేకలు దొంగిలించుకొని వస్తున్నాడని అనుమానంతో బంధించే ప్రయత్నం చేయగా అక్కడనుండి తప్పించుకొని వెళ్లిపోయాడు. ఈ మేరకు గురునాదం మాల్యాద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరావు తెలిపారు.

ఎస్‌జీటీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులోని ఎస్‌పీఎస్ అప్పర్ ప్రైమరీ ద్రవ్య సహాయక పాఠశాలలో ఎస్‌జీటీ తెలుగు లాంగ్వేజ్ పండిట్, హిందీ లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించడంగానీ cseap.gov.in వెబ్‌సైట్‌లో ఎయిడెడ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌గానీ చూడాలని సూచించారు. డిసెంబరు 11వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సోమశిలలో 70.011 టీఎంసీల నీరు

అనంతసాగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 3,026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.011 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 6000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పాతకక్షలతో పరస్పర దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన మీరా మొహిద్దీన్‌కు నేతాజీ నగర్‌కు చెందిన యాసిర్‌తో పాత గొడవలున్నాయి. కొంతకాలంగా వీరి మధ్య వివాదాలు సాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ రాత్రి డైకస్‌రోడ్డు వద్ద వారిద్దరు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పరస్పర ఫిర్యాదులతో గురువారం వేదాయపాళెం పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై విజిలెన్స్ విచారణ

● ఫీల్డ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసు ● నిధుల రికవరీకి ఆదేశం



చిన్నగోపవరం గ్రామంలో కూలీలను విచారిస్తున్న చీఫ్ విజిలెన్స్ అధికారి భవానీ హర్ష, డ్వామా పీడీ

కలువాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలం చిన్నగోపవరం పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ అధికారి బి భవానీ హర్ష గురువారం విచారణ జరిపారు. వైసీపీ పాలనలో ఇక్కడ జరిగిన ఉపాధి పనుల్లో కనీవినీ ఎరుగని రీతిలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఇటీవల జరిగిన సోషల్ ఆడిట్‌లో బయటపడింది. ఈనేపథ్యంలో రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి స్వయంగా చిన్నగోపవరానికి వచ్చి జాబ్‌కార్డులలో ఇతరుల పేర్లు చేర్పించిన విషయమై కూలీలను విచారించారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 మంది కూలీలు తమ జాబ్‌కార్డులలో ఉన్న పేర్లు మాకు సంబంధించినవి కాదని, వారు ఎవరో తెలియదని చెప్పినట్లు, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. నగదు పడిన ఖాతాలు కల్గిన వారిపై కూడా చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేస్తామని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసు పెట్టి నిధులు రికవరీ చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన వెంట డ్వామా పీడీ బి గంగాభవాని, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, అంబుడ్స్ పర్సన్ వెంకటరెడ్డి, ఏపీడీ శంకర్‌నారాయణ, ఎంపీడీవో ఎం నరసింహరావు తదితరులు ఉన్నారు.

'మిథాని' ఏర్పాటులో ముందడుగు

● కేంద్ర రక్షణ మంత్రిని కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లా అభివృద్ధిలో కీలకం కానున్న మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిథాని) పరిశ్రమ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో మంత్రిని కలిసి విన్నవించారు. రూ.3982 కోట్ల పెట్టుబడితో ఏర్పాటయ్యే ఆ పరిశ్రమ ద్వారా దాదాపు 10వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. జిల్లాలోని కొడవలూరు మండలంలోని బొడ్డువారిపాళెం గ్రామం వద్ద 110ఎకరాలను 'మిథాని' కోసం కేంద్ర ప్రభుత్వం 2017లో కేటాయించిందని తెలిపారు. నాలుగేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదని, ప్రత్యేక చొరవతో పరిశ్రమను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సానుకూలంగా స్పందిస్తూ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పద్మాదేవి

మచిలీపట్నం (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పద్మాదేవిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆమె నెల్లూరు జిల్లా విజిలెన్స్ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా ఆమె కొనసాగాలని పేర్కొన్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులనుంచి ధాన్యం కొనుగోలుకు సక్రమంగా చర్యలు తీసుకోకపోవడం, రైతులు ఇబ్బందులపాలయ్యే పరిస్థితులకు గురిచేయడం వంటి కారణాలతో ప్రస్తుతం జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి మేనేజర్‌గా పనిచేస్తున్న డి.సృజనను ఆ బాధ్యతలనుంచి తప్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

సూడోమోనాస్ వాడండి

అల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు వరిసాగులో చేపట్టే సస్యరక్షణలో అనవసర రసాయన మందులు పిచికారి చేయకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సూడోమోనాస్ వినియోగించాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం నార్త్‌మోపూరులో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరిపంటలో సంభవించే పలు రకాల తెగుళ్ల రానీయకుండా చేస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కాకుమాను ఆంజనేయులు ఆధ్వర్యంలో గురువారం నాయకులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, చుండూరి కోటేశ్వరరావు, సందాడి నాగేశ్వరరావు ఉన్నారు.

గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జిగా ఏఈగా నాగరాజు

లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి ఏఈగా నాగరాజు నియమితులయ్యారు. గురువారం స్థానిక గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో విధుల్లో చేరారు. లింగసముద్రం మండలంలో కొంతకాలం నుంచి పెంట్రాల ఇంజనీరింగ్ అసిస్టెంటు ఎం.వెంకటేష్ ఇన్‌చార్జిగా ఏఈగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులుమండల గృహనిర్మాణ శాఖ ఏఈగా పచేస్తున్న నాగరాజును ఇక్కడకి ఇన్‌చార్జిగా పంపారు.

లింగసముద్రం ఆర్ఐగా రమణయ్య

లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్ఐగా కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రమణయ్యను నియమించారు. గురువారం ఆయన విధుల్లో చేరారు. కార్యాలయంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, సచివాలయాల్లో ముగ్గురు వీఆర్‌ఓలు, ముగ్గురు సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా భర్తీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


శబరిమలకు తరలిన అయ్యప్ప భక్తులు

వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఇరుముడులు కట్టుకొని శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు అర్చకులు చంద్రకాంత్ ముందుగా స్వామికి అభిషేకం చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులతో ఆలయం కిక్కిరిసిపోయింది.

మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నాయపాలెం బెల్టు దుకాణంపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మకాలు చేపడుతున్న అరగల క్రిష్ణబాబును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 15మద్యం బాటిళ్ల, అరగల క్రిష్ణయ్య వద్ద 18 మద్యం బాటిళ్ల స్వాధీనం చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలో మద్యం అమ్మకాలు చేపడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక పాల్గొన్నారు.

సమస్యలపై శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

అనంతసాగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో సమస్యలను ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో మస్తాన్ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని సాగునీటి సంఘాలకు వచ్చేనెల 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు జలవనరుల శాఖ డీఈ కందుకూరు చంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం మండలంలో 6, ఉదయగిరి మండలంలో 11 చెరువులకు, గండిపాళెం జలాశయం పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీలు మొత్తం 34 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సిద్ధం చేశామని, 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. పేరు లేని రైతులు దరఖాస్తు చేసు కోవచ్చన్నారు.

ఓటు షిఫ్టింగ్ ఎంతవరకు సాధ్యం

- విద్యార్థులు, పెద్ద వ్యాపారుల మార్పిడికి ఇబ్బంది లేదు
- మిగిలిన వారికి తలనొప్పే
- పూర్తి వివరాలు రాక అధికారుల అవస్థలు

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎక్కడ నివాసం ఉన్నారో అక్కడే మీ ఓటును షిఫ్టింగ్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలు ప్రజలకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ప్రస్తుతం అధికారులు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. చాలామంది తాము నివాసం ఉంటున్న చోటుకు తమ ఓటును మార్చుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. ఓటు షిఫ్టింగ్‌కు ఇపుడు వయస్సు ధ్రువీకరణ పత్రం నమోదు చేస్తేనే కంప్యూటర్ తీసుకుంటుందని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. వయసు ధ్రువీకరణకు ఆధార్ కాకుండా అదనంగా పదో తరగతి మార్కుల జాబితా, జనన సర్టిఫికెట్, పాన్‌కార్డు నకళ్ల ఇస్తేనే ఓటు షిఫ్టింగ్‌కు అవకాశం ఉంటుంది. వయసులో ఉన్న యువకులు, జనన సర్టిఫికెట్లు, పదో తరగతి మార్కుల జాబితాలు అందుబాటులో



కావలి మున్సిపల్ కార్యాలయం

ఉంటాయి. అలాగే వ్యాపారులు చేసుకునే వారికి పాన్‌కార్డులు ఉంటాయి. మిగిలిన వారు తమ ఓటు షిఫ్టింగ్ చేసుకోవాలంటే అవన్నీ ఎక్కడ తేవాలని.. అది ఎంతవరకు సాధ్యం అవుతోందని ప్రజలు వాపోతున్నారు. అలాగే సచివాలయ సిబ్బంది కూడా వాటిని సేకరించటం కష్టతరం అంటున్నారు. ఈ పరిస్థితితుల్లో నివాసం ఉన్నచోటనే ఓటు ఉండాలనే అధికారుల సూచన ఎంతవరకు సాధ్యమవుతోంది. పట్టణంలో అద్దె గృహాలలో ఉన్న వారు తరచూ ఇళ్లు మారుతుంటారు. వీరు నివాసం ఒకచోట ఓటు మరొకచోట ఉంటుంది. వాటిని నివాసం ఉన్న చోటుకే మార్చుకోవటం ఆచరణ సాధ్యమేనా అనే సమస్య ఉత్పన్నమవుతోంది. ఇదిలాఉంటే ఓటు షిఫ్టింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు తాము పెట్టుకున్న అడ్రస్‌లు కొత్తగా వచ్చిన మున్సిపల్ సిబ్బందికి అర్థంకావడం లేదు. దరఖాస్తులను వెరిఫికేషన్ కోసం బీఎల్వోలకు పంపడానికి మున్సిపల్ ఉద్యోగులు తంటాలు పడు తున్నారు. ఇన్ని సమస్యల మధ్య నివాసం ఉన్న చోటనే ఓటు ఉండాలనే అధికారుల ఆదేశాలు ఎంతవరకు సాధ్యపడతాయో వేచి చూడాల్సి ఉంది.

అర్హులందరికీ అందేలా సంక్షేమ పథకాలు

- హేమంత్ భరత్‌కుమార్, ఏవో, వలేటివారిపాలెం



వలేటివారిపాలెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్హులైన రైతులందరికీ ప్రభుత్వసం క్షేమ పథకాలు అందేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి హేమంత్ భరత్‌కుమార్ తెలిపారు

? ఎరువులు అందిస్తున్నారా?

! ఎరువులు కావల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సరఫరా చేస్తాం. ప్రస్తుతం బడేవారిపాలెం సొసైటీలో ఎరువులు సరఫరా చేస్తున్నాం.

? పంటలు సాగులో ఉన్నవి.

! మండలంలో మినుము, మిర్చి, వరి, శనగ, పొగాకు పంటలు సాగులో ఉన్నాయి.

? ఇపుడే వర్షం కురిస్తే పంటలకు నష్టమా ?

! ఇప్పుడు అన్ని పంటలకు ఓ మోస్తారు వర్షం అవసరం. అత్యధికంగా వర్షం కురిస్తే శనగ, పొగాకు, మినుము పంటలకు స్వల్పంగా నష్టం వాటిల్లే అవకాశం ఉంది

? విత్తనాల సరఫరాలో ఎలా ఉంది.

! ప్రస్తుతం సబ్సిడీపై శనగ విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు సరఫరా చేస్తున్నాం.

? సిబ్బంది కొరత ఏమైనా ఉందా.

! మండలంలో 15 రైతు సేవాకేంద్రాలు ఉన్నాయి. 15 మంది విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లలో 8మంది మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరు రెండేసి రైతుసేవా కేంద్రాలకు పని చేస్తున్నారు.

వెలగని వీధిలైటు



పట్టణంలోని ముసునూరు ట్రంక్‌రోడ్డులోని వీధిలైట్లు కొద్దిరోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రిళ్ల ఈ ప్రాంతంలో అంధకారం నెలకొంటుంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఈ లైటు రాత్రి, పగలు తేడా లేకుండా వెలుగి కాలిపోయిందని స్థానికులు వాపోతున్నారు.

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

కావలిని కనకపట్టణంగా అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలిని కనక పట్టణంగా అభివృద్ధి చేస్తానని ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన 15మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిన అభివృద్ధి పనులు అన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మాలేపాటి నాగేశ్వరరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, బండి అమర్‌రెడ్డి, తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీను, జనిగర్ల మనోహర్, దేవకుమార్, బాలాజీ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

- మాటఇస్తే తప్పడు..

బిట్రగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి బేతనీపేటలో సీసీరోడ్డు పనులు ప్రారంభించడం హర్షణీయం అని టీడీపీ బోగోలు ఇన్‌చార్జి, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఆయన రోడ్డు పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో దళిత, గిరిజన కాలనీల్లో అవసరమైన చోట్ల ఈ రోడ్లు వేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోచిపాతల సంజయ్, శ్యాంసుందర్, నాగరాజు, సుభాని, వినోద్, బంకా ఫిలిప్, అనిల్, విజయ్, ఫిలోమెన్ రాజు ఉన్నారు.

కమ్మేసిన చిల్లచెట్లు



జమీన్‌ఉప్పలపాడు నుండి కొండసముద్రం గ్రావెల్ రోడ్డు, శింగమనేనిపల్లె- కాకుపాలెం, అయ్యవారిపల్లె - రామలింగాపురం, లింగపాలెం- రోళ్లపాడు వెళ్లే రోడ్లు చిల్లచెట్లతో మూసుకపోయాయి. ఈ సమస్యతో మలుపుల్లో వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారులు ప్రక్కన ప్రమాదకరంగా ఉన్న ముళ్ల చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి)

నేడు పెయ్యదూడల ప్రదర్శన

వరికుంటపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కనియంపాడులో శుక్రవారం దూడల ప్రదర్శన, పోటీలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో మేలుజాతి లేగ, పెయ్యదూడల ప్రదర్శన నిర్వహించి విజేతలకు బహుమతులతో పాటు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఉదయగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):కొండాయపాళెం రెవెన్యూ పరిధిలోని సర్వరాబాదు గ్రామం వద్ద గల సర్వే నెంబర్ 740లో గురువారం వీఆర్వో మాల కొండయ్య హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 10.54 విస్తీర్ణంతో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్న ఆ భూమిని సాగు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు వీఆర్వో తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సాంఘీక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ బీ శ్రీనివాసులు సూచించారు. గురువారం రాత్రి నర్రవాడ ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఘనంగా 134వ వర్ధంతి
- నివాళులర్పించిన నాయకులు, అధికారులు

కావలి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని గు రువారం పట్టణంలో నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కూడలి ట్రంకురోడ్డులోని పూలే విగ్రహానికి, టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, నేతలు మధుబాబునాయుడు, నాయుడు రాంప్రసాద్, తటవర్తి వాసు, అర్షియా, తిరువీధి ప్రసాద్, ఆత్మకూరి నాగరాజు, చవల రామకృష్ణ, గుండ్లపల్లి శివాజీ, యేటూరి శివ పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పబ్బా సాయి, మన్నేపల్లి రిషికేష్, పసుపులేటి బాబు, మస్తాన్ పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, అమరా సుబ్బారావు, పరుసు వెంక టేశ్వ ర్లు, మందా కిరణ్, సుందర్ శెట్టి సుజయ్ పాల్గొన్నారు. బీసీ ఐక్యతా భవన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షు లు అద్దంకి ప్రభాకర్, ప్రధా న కార్యదర్శి చిన్నివరప్రసాద్‌లు ప్రభుత్వ ఏరియా వైద్య శాలలో రోగులకు రొట్టెలు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవిందు పాల్గొన్నారు. చివరిగా రక్తదానం-స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఆసుపత్రి సూప రింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు. కార్యక్ర మంలో ఆసుపత్రి కమిటీ సభ్యులు చవల రామ కృష్ణ, సంస్థల నిర్వాహకులు ఖాదర్‌బాష, అలీమ్, బ్రహ్మ య్య, ఖాదర్‌బి, మాలకొండారెడ్డి ఉన్నారు.



కావలి : పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

- అల్లూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామిశెట్టి కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, అంబటి రాజేంద్ర, తిరుమలశెట్టి శ్రీనివాసులు, పరంధామిరెడ్డి, కప్పిరి విష్ణు, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి, వేలూరు శ్రీనివాసులు, పచ్చబట్ల సురేంద్ర, ఖదీర్, నజీర్‌బాషా, ఇమాంసా తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు: నివాళులర్పిస్తున్న బీద గిరిధర్, నాయకులు

నేటి సమాజానికి ఆదర్శమూర్తి పూలే

- బిట్రగుంట: టీడీపీ మాజీ మండల కన్వీనర్ పిన్నిబోయిన సుధాకర్ స్థానిక పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాయసం శ్రీనివాసులు, బీసీ నేత దేవరాల తిరుపతి, మునయ్య ఉన్నారు.
- కందుకూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, చదలవాడ కొండయ్య, చిలకపాటి మధు, గోచిపాతల మోషే, షేక్ రఫీ, మహర్షి శ్రీను, రూబీ, కూనం నరేంద్ర, చుండూరి శ్రీనివాసులు, ముచ్చు శ్రీను, సలాం, మోదడుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోకూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు.



బిట్రగుంట: పూల మాలవేస్తున్నసుధాకర్

బాలికలను సంరక్షిస్తూ.. చదివించాలి



కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ హేన సుజన్

లింగసముద్రం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలికలను చదివించాలని స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ తెలిపారు. గురువారం పెదపవని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మహిళా సాధికారత, బాలల అభివృద్ధి, సైబర్ క్రైమ్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాలని, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, బాలల హక్కులు, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే రక్తహీనత, సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది గురించి, 2006 బాల్య వివాహాల నిరోధక చట్టం, పోక్సో యాక్ట్ 2012పై వివరించారు. మహిళలు, బాలికలకు హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 112, 1930 గురించి వివరించారు. ప్రిన్సిపాల్ స్నేహలత, ఐసీడీఎస్ సిడిపిఓ అరుణ, సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్, ఎస్ ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ టి కమల, సూపర్‌వైజర్ రాధాదేవి ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

1న పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఏర్పడి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆదివారం కందుకూరులో పూర్వవి ద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సునీల్ తెలిపారు. గురువారం పట్టణంలో సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ప్రసాద్, నరేష్, చందు, భాస్కర్, మల్లిఖార్జున, నారాయణ పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం

కలిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని సిద్దనకొండూరు ఆయుర్వేద వైద్యాధికారి రోహిణి తెలిపారు. కేంద్రం కొత్తగా చేపట్టిన దేశ్‌కీ ప్రకృతి పరీక్ష అభినయ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కేంద్రం ప్రతి ఒక్కరికి అందుబాటులో ప్రకృతి యాప్‌ను తీసుకొచ్చినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే ఏ వయసు వారు ఏ ఆహారపు అలవాట్లను పాటించాలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది ఎం.కృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీకాంత్, లలిత కుమారి ఉన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఏపీవో సుహాసిని తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి 132 కేవి సబ్‌స్టేషన్ లో మరమ్మతుల కారణంగా సీతారామపురం సబ్‌స్టేషన్ 33 కేవి ఫీడర్‌కి శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీహరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఏఓ వి.రాము ఆధ్వర్యంలో నెల్లూరు భూసారపరీక్ష సహాయ వ్యవసాయ సంచాలకులు కన్నయ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాకు వివరాలు, స్టాకు రిజిష్టర్లు, ఈ పాస్ మిషన్లలోని నిల్వలను పరిశీలించారు. రైతులకు రసీదు ఇవ్వాలని బిల్లు పుస్తకంలో రైతు సంతకం తీసుకోవాలని సూచించారు. నోటీసు బోర్డులో ఎంఆర్‌పీలు, నిల్వలు చూయించాలని దుకాణదారులకు సూచించారు. రైతులు లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరివీధిపాడులో సీసీరోడ్డు పనులకు గురువారం సర్పంచు డబ్బు రమణయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాలతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవి కుమార్ చౌదరి సూచనలతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి చేజర్ల ఇబ్రిస్, నేతలు సుబ్బారావు, మాలకొండయ్య భాస్కర్ ఉన్నారు.

ఎంఈవో తనిఖీ

కావలి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పాఠశాలను గురువారం ఎంఈవో గోవిందయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి లాంగ్ అప్రెంటీస్‌లపై హెచ్ఎంను వివరణ కోరారు. పిల్లల సామర్థ్యాలు ఉపాధ్యాయులు భోధనా విధానాలను పరిశీలించి సూచనలిచ్చారు. పిల్లలను కొన్ని ప్రశ్నలడిగా సమాధానాలు రాబట్టారు.

మినీ గోకులానికి శంకుస్థాపన

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంజీవరెడ్డి నగర్‌లో పల్లెపండుగలో భాగంగా గురువారం మినీ గోకులానికి టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ సువార్తయ్య, ఏపీవో సుహాసినీ, టెక్నికల్ అసిస్టెంట్ మురళీకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాదు, టిడిపి నాయకుడు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని ఆందోళన

ఉదయగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటుచేయవద్దని గురువారం బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఐటీడీపీ కన్వీనర్ రెడ్డిబత్తిన ఉమాసాయిరాం మాట్లాడుతూ ఇటు ఉదయగిరి, అటు వరికుంటపాడు మండలాల గ్రామాలకు అనువుగా గండిపాళెం గ్రామం ఉండడంతో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా గ్రామంలో త్వరలో మద్యం దుకాణం ఏర్పాటు చేయను న్నట్లు ఫ్లెక్సీ సైతం ఏర్పాటు చేశారన్నారు. గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని ఇటీవల ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాలు సైతం సమర్పించామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటును విరమించుకోవాలని, లేదం టే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హె చ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు షేక్ ఇమ్రాన్ యువకులు పాల్గొన్నారు.



గండిపాళెం గ్రామంలో ఆందోళన చేస్తున్న మహిళలు

'హుందాయ్'కు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెండు లక్షల రూపాయల వార్షిక వేతనంతో 40 మంది ఫైనలియర్ విద్యార్థులు హుందాయ్ కంపెనీకి ఎంపికైనట్లు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల టెక్నికల్ డెరెక్టర్ విజయ్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం కాలేజీలో కంపెనీ హెచ్ఆర్ మౌలాలి, కుతుబ్‌లు నిర్వహించిన ఎంపికకు 77మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరికి హైదరాబాదు హోండా కంపెనీలో విధుల్లో చేరేందుకు నియామకపత్రాలు అందజేశారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటయ్య, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి సాహిత్య, సుమలత పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి గురువారం సాయంత్రం స్థానిక మద్దూరుపాడులోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ చేయకుండా సరుకులు ఎత్తవద్దని అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిశుభ్రతకు చర్యలు చేపట్టండి

ఉదయగిరి రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

చెత్త తొలగించరా ?

కోవూరు శాంతినగర్ వీధుల్లో చెత్తాచెదారం పేరుకుని కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. మొదటి, రెండో వీధి, సొసైటీ ప్రాంతంలో పారిశుధ్యలోపం తలెత్తింది. వర్షాకాలం కాబట్టి చెత్తాచెదారంలో చేరిన దోమల వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అంతేకాక కాలనీలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. తమ కాలనీలో పారిశుధ్యం మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)




కోవూరు శాంతినగర్‌లో పేరుకున్న చెత్త, సంచరిస్తున్న పందులు

మైనింగ్ భూముల పరిశీలన

సైదాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రిజర్వ్ ఫారెస్టు భూముల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న మైనింగ్‌లను గురువారం జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా పరిశీలించారు. కేఎంసీ, అమృతేష్ మైన్లకు ప్రభుత్వ అనుమతుల రికార్డులు పరిశీలించారు. పాలూరు గ్రామంలో శ్రీగంధం చెట్ల కోతకు అనుమతుల కోసం రైతులు విన్నవించుకోవడంతో పరిశీలించారు. షా మైన్ సమీపంలో సెంట్రల్ నర్సరీ కోసం స్థలాన్ని పరిశీలించారు. అటవీ భూముల్లో అనుమతులు లేకుండా తెల్లరాయి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని డీఎఫ్‌వో హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్ రవిశేఖర్, కేఎంసీ మైన్ ఓనర్ గోగినేని భరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



కేఎంసీ మైన్‌లో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మహిళలపై లైంగిక వేధింపులకు కఠిన శిక్షలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని కఠిన చట్టాల ద్వారా శిక్షించటం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి హెచ్చరించారు. మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలకు రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి న్యాయ సేవలు అవసరమైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అలాగే లోక్ అదాలత్ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

'అపోలో'లో లంగ్‌లైఫ్ స్క్రీనింగ్ పరీక్షలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఊపిరితిత్తుల కేన్సర్‌ను ముందుగానే గుర్తించి చికిత్స ద్వారా మరణాల సంఖ్యను తగ్గించేలా అపోలో ఆసుపత్రిలో లంగ్ లైఫ్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభించామని ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్ వెల్లడించారు. నెల్లూరు అపోలో ఆసుపత్రిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 50 నుంచి 80 ఏళ్ల మధ్య వయస్కులకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంకాలజీ ఫిజీషియన్ డాక్టర్ హరిత, అంకాలజీ సర్జన్ డాక్టర్ మనోభి రామ్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ఉమామహేష్, డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న కేన్సర్‌లలో ఊపిరితిత్తుల కేన్సర్ చాలా ప్రమాదకరమైందన్నారు. అధునాతన వైద్యంతో రోగికి పునర్జన్మ ప్రసాదించే అవకాశం ఉందన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): విత్తన శుద్ధి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాలెంలో గురువారం పొలంబడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రీయ ఎరువులపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో శిరీష, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

'విజ్ఞాన వీచికలు' ఆవిష్కరణ

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన వీచికలు పేరుతో రూపొందించిన సండే మార్కెట్ క్యాలెండర్ పుస్తకావిష్కరణ గురువారం నగరంలోని సండే మార్కెట్ కార్యాలయంలో జరిగింది. విజ్ఞాన ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ విజ్ఞాన వీచికల పుస్తకం అందరికీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రచయిత ఈతకోట సుబ్బారావు మాట్లాడుతూ విజ్ఞాన వీచికలు అనే గ్రంథం చరిత్ర, సంస్కృతి, ఉద్యమాలు, ఆవేశం, ఆక్రందనలు, అధ్యయనం., ఇలా అన్నింటినీ రంగరించి పోసిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషోద్యమ సమితి నాయకుడు చెలం చర్ల భాస్కర్ రెడ్డి, ప్రగతిశీల ప్రజావేదిక నాయకుడు చంద్రన్న, సండే మార్కెట్ యూనియన్ అధ్యక్షుడు హఫీజుద్దీన్, నాయకులు శరవణన్, మురుగేశన్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌తో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకాణి కబుర్లు ప్రజలు నమ్మరు : టీడీపీ నాయకురాలు రేవతి

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పే కాకమ్మ కబుర్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదంటూ తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు రేవతి ధ్వజ మెత్తారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కోర్టులో డాక్యుమెంట్లు దొంగతనం చేసిన చరిత్ర కాకాణిద న్నారు. మంత్రి నారాయణ మనస్తత్వం తెలిసి కూడా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించటం సరికాదన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా మాపై దాడులు చేసి అక్ర మ కేసులు పెట్ట లేదా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలపై దాడులు చేయించాల్సిన అవసరం తమకు లేదని, బంధువుల మధ్య జరిగిన గొడవలో సాకేష్ అనే వ్యక్తి గాయపడ్డాడని చెప్పారు. మంత్రి నారా యణను విమర్శిస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిల నగర కార్యదర్శి విజయ, నాయకురాళ్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేవతి

హోటల్ వ్యాపారాన్ని బతికించండి : కృష్ణారెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు భోజనం అంటే ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని, అలాంటి వ్యాపారాన్ని బతికించాలని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వివిధ హోటళ్ల యజమానులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో కొంతమంది కొన్ని హోటళ్లను లక్ష్యంగా చేసుకుని బొద్దింకలు, జెర్రెలు, బల్లులు ఆహారంలో ఉన్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్ వ్యాపారంలో పోటీ పెరిగి వ్యాపారంలో నష్టం వస్తున్నా వినియోగదారులకు రుచి, శుచి కలిగిన ఆహారాన్నే అందిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు లేకపోతే హోటల్ పరిశ్రమ మనుగడ సాగించలేదన్నారు. సోషల్ మీడియాలో అవాస్తవ ప్రచారాలపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాయలసీమ, బసోటా, రేష్మా, గణేష్‌మెస్‌తోపాటు నగరంలోని వివిధ హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

'బాల్య వివాహ రహిత కార్యక్రమానికి సహకారం'

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుజిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చేందుకు ప్రభుత్వానికి సహకరిస్తామని చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ టీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాల్య వివాహ రహిత సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా మండల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు గురువారం 13వరోజుకి చేరాయి. ఉదయం పాలాభిషేకం, గణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలిశ పూజ, నవకాభిషేకం, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం అత్తాళం పూజ, భగవతిసేవ, పడి కర్పూర హారతులు జరిగాయి.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

● వాడవాడలా 134వ వర్ధంతి ● ఘనంగా నివాళులు



నెల్లూరు : పూలేకు జనసేన నేతల జోహార్లు



అన్నదానం చేస్తున్న ఉల్లిపాయల శంకరయ్య



పొదలకూరు : పూలే విగ్రహానికి నివాళులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలు, బాలికా విద్యపై ప్రజలను చైతన్యవంతులను చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే అందరికీ ఆదర్శనీయుడని పలువురు కొనియాడారు. పూలే 134వ వర్ధంతిని నగరంలో గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పూలే సేవలను, సిద్ధాంతాలను వివరించి ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే అని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ అన్నారు. నగరంలో మినీబైపాస్‌లో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

● సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు వుల్లిపాయల శంకరయ్య ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. జ్యోతీరావు దంపతులు జీవితాంతం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేసి, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

● జిల్లా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మలమాల శ్రీహరిరావు, జిల్లా అధ్యక్షుడు మాల్యాద్రి, నాయకులు పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆరంబాకం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● **నగరపాలక పాఠశాలలో..**

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం పూలే వర్ధంతిని నిర్వహించారు. హెచ్‌ఎం భాస్కర్‌రావు మాట్లాడుతూ సంఘ సంస్కర్త, విద్యావేత్త అయిన జ్యోతీరావు ఆశయాలను కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి**

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలకులు విద్యకు ప్రాధాన్యత ఇచ్చి ప్రతి ఒక్కరికీ చదువు నేర్పించటం తమ బాధ్యతగా వ్యవహరించాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూల మాల వేసి నివా ళులర్పించారు. నాయకులు గుంజి సుధాకర్, కటికాల వెంకటేశ్వర్లు, వెంకట కృష్ణయ్య, తిరుపతి పెంచలయ్య, కోదండరామిరెడ్డి, గోపసాని రమేష్, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● **జన సైనికుల నివాళి**

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : పూలే దంపతుల విగ్రహాలకు జనసేన పార్టీ నాయకులు గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ సామాజిక సమానత్వానికి పూలే పోరాటం ఆదర్శనీయమన్నారు. జనసేన పార్టీ మూల సిద్ధాంతాలు పూలే ప్రేరణతో పుట్టినవేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, సుందర రామిరెడ్డి, జమీర్, కృష్ణారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **పొదలకూరులో..**

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పూలే వర్ధంతి సందర్భంగా గురువారం మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఊకోటి లక్ష్మీనారాయణ, తుమ్మల శ్రీనివాసులు, పములుల శంకరయ్య, చొప్ప వెంకటేశ్వర్లు, కే.సిద్ధయ్య, రఘురామయ్య, పైడాకుల సుధాకర్, కోడూరు మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన

● ఎంపీడీవో వెంకటేశ్వర్లు



తోటపల్లిగూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై చర్యలు చేపట్టాం. గ్రామాల్లో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి పంచాయతీలోనూ పంచాయతీ సెక్రటరీలు ఏఎన్ఎంలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో కే వెంకటేశ్వర్లు తెలిపారు.

? : గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు

! : పలు గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేడదిబ్బలు తొలగించాలని నోటీసులు ఇచ్చాం. తొలగించకుంటే చర్యలు తీసుకుంటాం.

? : చెత్తకుండీలు ఎక్కడ ఏర్పాటు చేశారు.

! : 22 గ్రామ పంచాయతీల్లో ప్రతి ఇంటికి చెత్త బుట్టలు త్వరలో పంపిణీ చేస్తాం. చెత్తను ప్రజలు చెత్తకుండీలో వేయాలి.

? : వ్యాధులు ప్రబలకుండా తీసుకున్న చర్యలు ఏమిటి

! : గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా 15రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులు క్లీనింగ్ చేసి క్లోరినేషన్ చేయిస్తున్నాం. మురికి గుంటలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లుతున్నాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నాం. రోడ్లపై పేడదిబ్బలు లేకుండా చేస్తున్నాం.

? : ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయి కదా

! : గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని తమ దృష్టికి వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు

తోటపల్లిగూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు సెంటర్‌లో గురువారం ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు మారుబోయిన రాజా మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నరుకూరు సెంటర్ ఆటో సంఘం నేతలు పరశురామయ్య, గోపి, శివ, పచ్చా చిన్న, గణేష్, దయాకర్, భాస్కర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు28: సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్ నౌరాజ్, బుచ్చి రెండో వార్డు ఇన్‌చార్జి పీ మోహన్, సెక్రటరీ షేక్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక కమ్యూనిటీ భవన్‌లో బ్యాంకు సేవలు, ఆర్థికమోసాలపై బ్యాంకు ఖాతాదారులు, సంఘబంధం అధ్యక్షులకు అవగాహన కల్పించారు. సంస్థ రిసోర్స్ పర్సన్ కే.వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘ బంధం అధ్యక్షురాలు శారమ్మ పాల్గొన్నారు.

బంధువులే నమ్మించి మోసం చేశారు!

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు28(ఆంధ్రజ్యోతి): బంధువులే నమ్మించి నట్టేట ముంచారని వృద్ధులయిన అక్కాతమ్ముడు సత్తెమ్మ, సాయిబాబారెడ్డి బంధువులు సురేంద్రరెడ్డి, బలరామిరెడ్డి వాపోయారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆస్తి తీసుకుని కూడా వృద్ధులను గాలికొదిలేసి, ఆయనకు రాసిచ్చిన 84సెంట్లు భూమిని ఆక్రమించుకున్నారన్నారు. వారిని నిలదీసినందుకు సీఐ శ్రీనివాసులురెడ్డి వచ్చి, పొలంలోకి దిగితే కేసులు నమోదు చేస్తామని మమ్మల్ని హెచ్చరించారని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

జాతీయ మార్షల్ ఆర్ట్స్‌కు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హర్యానాలో డిసెంబరు 7 నుంచి జరిగే జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని స్కై మార్షల్ ఆర్ట్స్ సంఘం జిల్లా కార్యదర్శి వీ ఆదినారాయణ తెలిపారు. నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ వద్ద శిక్షణ పొందిన తొమ్మిది మంది క్రీడాకారులు ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించారన్నారు. వీరిలో అండర్-11 బాలికల విభాగంలో ఎన్ అభిజ్ఞ శ్రీకిరణ్, బాలుర విభాగంలో ఎస్కే హుజైఫ్ ఉల్ ముబారక్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జాతీయ పోటీల్లోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.

'డీకేడబ్ల్యూ'లో విద్యార్థినులకు పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పోస్టర్ ప్రదర్శన, వక్తృత్వ, రీల్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రమణరావు, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ వింధ్యావళి, ఆర్ఆర్‌సీ సభ్యులు డాక్టర్ ఎస్ అనిత, ఎస్ నాగశ్యామల, డీ మనోజ్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రెసిడెన్సియల్ శిక్షణలో ఉపాధ్యాయుడి మృతికి నివాళి

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా గజపతినగరంలో రెసిడెన్షియల్ శిక్షణలో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎస్ శ్రీనివాసరావుకు నివాళులర్పించినట్లు ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో జిల్లా అధ్యక్షకార్యదర్శులు సురేంద్రరెడ్డి, మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉన్నతాధికారులకు తెలియచేసినా పట్టించుకోకపోవడం తో ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు మృతి చెందారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులకు మండల, డివిజన్ కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వాలని, లేకుండా శిక్షణ తరగతులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

● దళిత సంఘాల నేతలు డిమాండ్

విడవలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముదివర్తి సర్పంచి విడవలూరు నిర్మలమ్మను దుర్భాషలాడిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సర్పంచికి మద్దతుగా గురువారం వారు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్‌రాజు మాట్లాడుతూ సర్పంచి నిర్మలమ్మ పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి ఎంబుక్‌లపై సంతకాలు పెట్టమని కార్యదర్శి శ్రీనివాసులును కోరితే, ఆయన నానాదుర్భాషలాడారన్నారు. కార్యాలయం నుంచి బయటకు పొమ్మన్నారని ఆయన పేర్కొన్నారు. నువ్వు నామాట వినకపోతే ఎమ్మెల్యేకి చెప్పి నీ చెక్కు పవర్ రద్దు చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. కార్యదర్శిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సర్పంచి నిర్మలమ్మ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి కార్యదర్శి తమకు వద్దని ఎమ్మెల్యేని కోరుతున్నామని తెలిపారు. అనంతరం ఈవోపీఆర్‌డీ మస్తాన్‌స్వామికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమాజ్‌వాద్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, దళిత సంఘం నేతలు మునలి నరేంద్ర, పల్లం శేషమ్మ, శ్రీరాం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నుడా చైర్మన్‌ను సత్కరించిన క్షత్రియ సంఘం నేతలు

తోటపల్లిగూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని మండల వన్నెకుల క్షత్రియ, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం అగ్నికుల క్షత్రియ నేత గండవరం రవిచంద్రన్ మాట్లాడుతూ క్షత్రియుల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉండాలని కోటంరెడ్డిని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండ్ర బాబురెడ్డి, పాకం వెంకయ్య, నెల్లటంబాక వెంకటేశ్వర్లు, గండవరం దీక్షిత్‌బాబు, వేగూరు శ్రీనివాసులు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నుడా చైర్మన్ కోటంరెడ్డిని సత్కరించిన క్షత్రియ నాయకులు

క్రీడా విజయాలు గౌరవాన్ని పెంచాయి : వీఎస్‌యూ వీసీ

వెంకటాచలం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విద్యార్థులు సాధించిన విజయాలు వీఎస్‌యూ గౌరవాన్ని మరింతగా పెంచాయని వీసీ విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల క్రీడాపోటీల్లో విజేతలుగా గెలిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సీహెచ్. వెంకట్రాయులు తదిత రులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వైభవంగా సహస్ర దీపారాధన

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం రాత్రి సహస్ర దీపారాధన వైభవంగా జరిగింది. సీఐ శివరామకృష్ణారెడ్డి తొలుత దీపాన్ని వెలిగించి, స్వామిని దర్శించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా 18ఏళ్లుగా ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో షిరిడీ సాయిసేవా సమితి సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదర్‌రావు, ప్రతినిధులు పంగులూరు సుబ్బానాయుడు, లక్కాకుల ఆనందరావు, కొత్తా కోటేశ్వరరావు, తుమ్మల శ్రీనివాసులు, తరుగు ప్రభాకర్, కదిరి ప్రసాద్, తదిత రులు పాల్గొన్నారు.

రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ జరగాలి

● ఎంఆర్‌పీఎస్ కోఆర్డినేటర్ గోపి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్‌గా కాకుండా రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బెల్లంకొండ గోపి మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం ఎంఆర్‌పీ ఎస్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వేసిన కమిషన్లు త్వరగా విచారణ పూర్తి చేసి ఎస్సీలందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ గోవిందు మాదిగను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు కోలగట్ల రమేష్ మాదిగ, అనుబోలు వెంకట మాదిగ, ఇండ్ల సుధాకర్ మాదిగ, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఆత్మకూరు స్వర్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బెల్లంకొండ గోపి, నాయకులు

న్యూస్ బాక్స్

నేడు కోనలో ప్రత్యేక పూజలు

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శుక్రవారం స్వాతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4గంటలకు సుప్రభాత సేవ, గోపూజ బిందితీర్థం, కల్యాణోత్సవం, సాయంత్రం బంగారు గరుడసేవ నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బహిరంగంగా మద్యం సేవిస్తే కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన పొదలకూరులో విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపుల యజమానులకు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేయరాదని, సమయపాలన పాటించాలన్నారు. 21ఏళ్లలోపువారికి మద్యం అమ్మకూడదన్నారు. ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు చేయాలన్నారు. ఈనెలలో ఇప్పటి వరకు పొదలకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 అనధికార మద్యం కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశామన్నారు. 210 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సారా, మద్యం కేసుల్లో ఉన్న ఆరుగురు పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు పెట్టామని వివరించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీవో సునంద సూచించారు. మండలంలోని సిద్ధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు చేసుకుంటే వచ్చే సమస్యలను విద్యార్థినులకు వివరించారు ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, పాఠశాల ఉపాధ్యాయినులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

తోటపల్లిగూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అపోలో హాస్పటల్ సౌజన్యంతో ఈ పరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనుంజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విజయమ్మ, అపోలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా మెట్ల పూజ

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): నగరపంచాయతీలోని పెద్దూరు శివాలయంలో గురువారం అయ్యప్ప స్వామి మెట్ల పూజ వైభవంగా జరిగింది. పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల అయ్యప్పలు పూజలో పాల్గొన్నారు. మార్తాటి మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం బిక్ష పెట్టారు.

కళా బృందాల ప్రదర్శన

చిన్నశేష వాహనం ముందు కళాబృందాల ప్రదర్శనలు అలరించాయి. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన 25 మంది డ్రమ్స్‌తో భక్తులను పరవశింపచేశారు. చెన్నైకి చెందిన సత్యప్రియ బృందం భరతనాట్యం, కేరళకు చెందిన 30 మంది మహిళా కళాకారుల మోహినీ అట్టం.. హైదరాబాదుకు చెందిన 22 మంది మహిళలు దేవతామూర్తుల వేషధారణ, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. విశాఖపట్నంకు చెందిన 32 మంది చిన్నారులు, యువతులు మహిషాసురమర్దిని నృత్య రూపకం ప్రదర్శించారు. అమలాపురంలోని అయోధ్య సీతారామ కోలాట భజన మండలికి చెందిన మహిళల కోలాటం, హైదరాబాదు రఘు రమ్య అకాడమీకి చెందిన 28 మంది కళాకారుల శ్రీనివాస కళ్యాణం, కేరళకు చెందిన కళాకారుల నవదుర్గల వేషధారణ అలరించాయి.





చిన్నశేషుడిపై చిద్విలాసంగా..

కార్తీక బ్రహ్మోత్సవాల తొలిరోజున వేకువజామునే పద్మావతీ దేవికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆస్థాన మండపంలో సాయంత్రం 6 గంటలకు వేడుకగా ఊంజల్ సేవ జరిగింది. అనంతరం అమ్మవారిని వాహన మండపానికి తీసుకొచ్చి చిన్నశేష వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబర, వజ్రవైడూర్య ఆభరణాలతో దివ్య మంగళ స్వరూపిణిగా చిన్న శేషుడిపై రాజసంతో తిరుమాడవీధుల్లో రాత్రి ఏడు గంటలకు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

మరిన్ని విశేషాలు 6వ పేజీలో

అద్దాల మండపంలో అమ్మవారు

కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తొమ్మిది రోజుల పాటూ అమ్మవారి ఉత్సవర్లు అద్దాల మండపంలో కొలువై ఉంటారు. గురువారం రాత్రి వాహనసేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో కొలువుదీర్చారు. రోజూ ఉదయం ఇక్కడినుంచే అమ్మవారిని తీసుకొచ్చి వాహనసేవలు, ఇతర సేవలు నిర్వహిస్తారు. రాత్రి వాహనసేవ పూర్తవగానే అమ్మవారిని అద్దాల మండపానికి వేంచేపు చేస్తారు. తొమ్మిదవ రోజు పంచమీతీర్థం నాడు రాత్రి అమ్మవారిని సన్నిధిలో కొలువుదీరుస్తారు. బ్రహ్మోత్సవాల్లో మాత్రమే ఇలా సన్నిధిలో కాకుండా అద్దాల మండపంలో కొలువై ఉండటం విశేషం.









ధ్వజారోహణం

తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దోపిడీయత్నం



ఇది మన్నారుపోలూరు చేనేత కాలనీలోని చివరి ఇల్లు. పట్టపగలే ఇక్కడ దోపిడీకి ముగ్గురు దుండగులు యత్నించారు. కత్తితో బెదిరించారు. చివరకు ఓ మహిళ కేకతో పలాయనం చిత్తగించారు.

6

ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

మంగళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటో తేది ఆదివారం. దీంతో ఒకరోజు ముందుగా శనివారమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 2,64,636 మందికి రూ.113 కోట్లు ఈనెల 30న అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. ఆ రోజు పింఛన్లు పొందని వారు 2వ తేది (సోమవారం) తీసుకోవచ్చన్నారు.

ఎస్వీయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో డిసెంబరు 2 నుంచి నిర్వహించాల్సిన పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. 7 నుంచి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.

తిరుపతిలో కిడ్నాప్ కలకలం

ఈ చర్యకు పాల్పడింది ప్రియురాలే

గంట వ్యవధిలో ఛేదించిన పోలీసులు

6

నలుగురికి సీఎం సహాయనిధి

చెక్కులు అందజేసిన చంద్రబాబు

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న నలుగురికి సీఎంఆర్‌ఎఫ్ కింద సీఎం చంద్రబాబు గురువారం రాత్రి చెక్కులు అందించారు. వాయల్పాడు మండలానికి చెందిన జె.కుసుమకుమారి కుమార్తె మానస(13) అంకుర హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్న వీడియో ముఖ్యమంత్రికి పంపడంతో ఆయన చలించిపోయారు. వారికి సీఎం సహాయనిధి నుంచి రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు. చంద్రగిరి మండలం శేషాపురానికి చెందిన పొదిలి శారద కుమారుడు హర్షవర్ధన్ బాబు 19 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారికి ఆర్థికంగా మూడు లక్షల చెక్కు ఇచ్చారు. తిరుపతి రూరల్‌కు చెందిన ఆర్ నాగరాజు తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తన తల్లి కిడ్నీ సమస్యతో బాధపడుతోందని ఆర్థిక సహాయం కోరడంతో వారికి రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు.

ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయండి

గ్రామస్తులు, అధికారులతో సీఎం సమీక్ష

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి మూలపల్లె వరకు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి తన స్వగృహంలో అధికారులు, నారావారిపల్లె పరిసర గ్రామాల వారితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేయాలన్నారు. ఎ.రంగంపేటలోని ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. నారావారిపల్లెలోని ప్రభుత్వ భవనాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు శ్రీసిటీకి అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామస్తులు మూలపల్లెలో హంద్రీనీవా నీటి ప్రాజెక్టు గత ప్రభుత్వంలో నిలిచిపోయిందని, ఆ ప్రాజెక్టు పూర్తయితే చెరువుల అనుసంధానం చేయడం వలన చంద్రగిరి మండలం సస్యశ్యామలం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రధానంగా రైతులు పంటలు పండించలేకపోతున్నామని, శేషాచలం అడవుల నుంచి కోతుల బెడద అధికంగా ఉందని తెలపడంతో.. తగు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రతి రైతుకు ప్రతి నెల రూ.15 వేల రూపాయల ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో వ్యవసాయ ఆధారితపంటలు లాభదాయకంగా వచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేయాలన్నారు. ఆయా గ్రామస్తులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీపీవో సుశీలాదేవి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, గ్రామస్తులు గిరినాయుడు, వెంకటపతినాయుడు, నిరంజన్‌నాయుడు, పాశం చంద్రకుమార్‌నాయుడు, నారా సుబ్రమణ్యంనాయుడు, రాకేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు గురువారం నారావారిపల్లెలో జరిగాయి. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు, మంత్రి లోకేశ్‌తో పాటు నారా, నందమూరి కుటుంబ సభ్యులు, ప్రముఖులు నివాళులర్పించారు. ఆయనతో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని వ్యవసాయ బావి వద్ద రామ్మూర్తి నాయుడు కుమారులు నారా రోహిత్, గిరీష్‌తో పాటు చంద్రబాబు కుటుంబ సభ్యులు హిందూ సంప్రదాయ ప్రకారం పెద్దకర్మ నిర్వహించారు. ఆ తర్వాత సభావేదికపై రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. భోజనశాలకు వెళ్లి ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అందరితో ఆత్మీయంగా పలకరించారు. అక్కడనుంచి తిరిగి ఇంటికి చేరుకున్నారు.



శివాలయానికి వెళ్లి..

సీఎం చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడి సతీమణి ఇందిర, నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి తదితరులు గురువారం సాయంత్రం శేషాపురం వద్ద శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఎం పరామర్శ

నారావారిపల్లెలో ఇటీవల మృతిచెందిన నారా చిన్నబ్బనాయుడి ఇంటికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నబ్బ సతీమణి సావిత్రి, కుమారుడు నారా కిరణ్‌ను పరామర్శించారు. కందులవారిపల్లెలో ఇటీవలమృతి చెందిన పులివర్తి హరిహరచౌదరి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించారు. సంప్రదాయం ప్రకారం రాత్రి నారా గిరీష్, నారా రోహిత్ గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్లి దీపం చూశారు.



నారా రామ్మూర్తికి ఘన నివాళి

పలువురు రాజకీయ ప్రముఖుల హాజరు



డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు, మంత్రులు కె.అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, ఎం.రాంప్రసాదరెడ్డి, వి.అనిత, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి (పలమనేరు), కిశోర్‌కుమార్‌రెడ్డి (పీలేరు), మురళి (పూతలపట్టు), పులివర్తి నాని (చంద్రగిరి), ఆదిమూలం (సత్యవేడు), గాలి భానుప్రకాష్ (నగరి), గురజాల జగన్మోహన్ (చిత్తూరు), బొజ్జల సుధీర్ రెడ్డి (శ్రీకాళహస్తి), షాజహాన్ బాషా (మదనపల్లె), ధూళిపాళ్ల నరేంద్ర (పొన్నూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), థామస్ (గంగాధర్ నెల్లూరు) శ్రీనివాసులు (రాయదుర్గం), మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, సీకే బాబు, ఏఎస్ మనోహర్, నెలవల సుబ్రహ్మణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవి నాయుడు, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, నరసింహాచారి, కూటమి పార్టీల నేతలు, శ్రేణులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రామ్మూర్తి నాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

– తిరుపతి / చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

నేడు సీఎం తిరుగు ప్రయాణం

తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు శుక్రవారం అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నారు. ఉదయం 9.30 గంటలకు నారావారిపల్లెనుంచి బయలుదేరి 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానంలో గన్నవరం విమానాశ్రయం చేరుకుని.. అక్కడ్నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లనున్నారు. మంత్రి లోకేశ్ గురువారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు.

భారీ భద్రత: నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రావడంతో గురువారం పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి నివాసంలోకి అనుమతి ఉన్నవారిని మాత్రమే మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి అనుమతించారు. చాలామంది నాయకులను సీఎం నివాసంలోకి పోలీసులు అనుమతించలేదు. దీనిపై కొందరు పోలీసులతో వాదనకు దిగారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రధాన ద్వారం వద్ద తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ రవికుమార్, సీఐ అహమ్మద్, పోలీసులు బందోబస్తు చేపట్టాయి. భోజనశాల, వేదిక, సభా ప్రాంగణం, సీఎం ఇంటి వద్ద భారీ ఎత్తున పోలీసు బలగాలు మొహరించాయి. డాగ్ స్క్వాడ్లతో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఇతర అధికారులు డీఐజీ షిమోషి, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. కాగా, గురువారం రాత్రి చంద్రబాబు నారావారిపల్లెలో బస చేయడంతో పోలీసులు సీఎం ఇంటి చుట్టూ భద్రత పెంచారు.







అంగరంగ వైభవం అమ్మవారి బ్రహ్మోత్సవం





తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ జరిగే ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు ధ్వజస్తంభం ఎదుట అర్చకులు పూజలు చేసి సకల దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6.30 గంటలకు చక్రత్తాళ్వార్ ముందు సాగగా వెనుకనే అమ్మవారికి అభిముఖంగా గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. యాగశాల నుంచి మొలకెత్తిన నవధాన్యాలను ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభంపై ఉన్న గజప్రతిమకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభసూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం చేశారు. అదే సమయంలో అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కంకణభట్టారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు పాల్గొన్నారు.

కానుకగా గొడుగులు

చెన్నైకి చెందిన వీర్ వసంత్‌కుమార్ గురువారం ఆరు గొడుగులను అమ్మవారి ఆలయానికి కానుకగా అందించారు. టీటీడీ ఈవో శ్యామలరావుకి భక్తులు ఆలయం వద్ద అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు పెద్దశేష వాహనం
మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ
రాత్రి 7 గంటలకు హంసవాహనం

సకల దేవతలు అతిథులుగా రాగా, అఖిల జనకోటి ఆనందపరవశం కాగా ఎగిరింది ధ్వజపటం. ఎగసింది జయ జయధ్వానం. బ్రహ్మండ నాయకుడి ప్రియదేవకి పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులోవైభవంగా మొదలయ్యాయి. టీటీడీ కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తకోటికి అకట్టుకున్నాయి. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన యాత్రికుల మనసు దోచుకుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్ప సోయగం

తిరుచానూరులోని అమ్మవారి శుక్రవారపు తోటలో టీటీడీ ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ఈ ప్రదర్శనను టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం కలిసి ప్రారంభించారు. పురాణ గాథలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ ఘట్టాల ప్రదర్శనలు విశేషంగా నిలుస్తున్నాయి. వివిధ పుష్పాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల ఆకృతులు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్ప ప్రదర్శనశాల అద్భుతంగా తీర్చిదిద్దారు. మైసూరుకు చెందిన గౌరి గత 9 సంవత్సరాలుగా సైకత శిల్పాన్ని తయారు చేస్తున్నారు. ఈ ఏడాది పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సైకత శిల్పాన్ని రూపొందించారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఎక్స్‌పోఆయు, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన శిల్పకళ ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంది.



పట్టువస్త్రాల సమర్పణ



రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనాంతరం ప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు మీడియా సమావేశంలో మంత్రి చెప్పారు. సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు అన్ని దేవాలయాల్లో మెరుగైన మార్పులు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామన్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు

టీటీడీ ఈవో శ్యామలరావు

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గురువారం తిరుచానూరులో ధ్వజారోహణం కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు మూలమూర్తితోపాటూ, వాహన సేవలను సంతృప్తిగా తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

అమ్మవారి బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తులకు తిరుచానూరులోని ఆలయ ప్రాంగణంలోని లడ్డూ కౌంటర్‌లో తిరుమల లడ్డూలు కూడా విక్రయిస్తున్నారు. దర్శనానంతరం ఆలయం లోపల ఉన్న కౌంటర్లో లడ్డూ టికెట్లు ఇస్తారు. వాటితో బయటున్న కౌంటర్లో శ్రీవారి లడ్డూలు కొనుగోలు చేసుకోవచ్చు. రోజూ పదివేల తిరుమల లడ్డూలు తిరుచానూరులో అందుబాటులో ఉంచుతామని ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్ తెలిపారు.



కత్తితో బెదిరించి దోపిడీయత్నం

మన్నారుపోలూరులో పట్టపగలే ఘటన ● అడ్డొచ్చిన మహిళను ఆటోలో వేసుకెళ్లేందుకు ప్రయత్నించిన దుండగులు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రస్ కావాలంటూ అడిగారు. ఆపై కత్తితో బెదిరించి ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మన్నారుపోలూరు చేనేత కాలనీలో నివాసం ఉంటున్న తాపీ కూలీ వూడి మునస్వామి గురువారం పనికి వెళ్లారు. ఇంట్లో ఆయన భార్య దేవి, కుమారుడు చందు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగ్గురు వ్యక్తులు వీరి ఇంటి పక్కనే రోడ్డులో ఆటో నిలిపారు. అందులో ఒకడు వీరి ఇంటికొచ్చి ఏదో అడ్రసు కావాలంటూ తమిళంలో అడిగాడు. ప్రహరీ అవతల నుంచి అడ్రసు చెబుతున్న దేవి.. బయట మరో ఇద్దరు ఉండటం.. ఇతడు మద్యం తాగి ఉన్నాడని గమనించారు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న కుమారుడు చందు బయటకు వచ్చి ఇక్కడ అటువంటి అడ్రసు లేదంటూ చెప్పారు. ఆ వెంటనే దుండగులు ఈ అడ్రసు మాకు తెలియదు చెప్పండంటూ బలవంతంగా ఆ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి చందు మెడపై కత్తి పెట్టారు. అరిస్తే చంపేస్తామంటూ బెదిరించారు. పక్కనే ఉన్న దేవి కేకలు వేయడంతో పక్క ఇంట్లో ఉన్న వల్లూరు వెంకటమ్మ అరుస్తూ వెళ్లి తలుపులు కొట్టింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చారన్న భయంతో దుండగులు తలుపులు తీసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో వెంకటమ్మను బలవతంగా ఆటో వద్దకు లాక్కెళ్లి బెదిరించారు. కాసేపు వారితో పెనుగులాడిన ఆమె తప్పించుకొని పరుగెడుతూ ఇంట్లోకి వెళ్లారు. అప్పుడే భోజనానికి వస్తున్న మునస్వామి ఏమి జరిగిదంటూ అరవడంతో దుండగులు ఆటోలో సూళ్లూరుపేట వైపు వెళ్లారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి వివరాలు తీసుకొన్నారు. ఆంధ్ర, తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు దేవి, చందు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.75 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,626 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,231 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వనజాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ 1, బయో ఇన్ఫర్మేటిక్స్ 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీ పీజీసెట్‌కు సంబంధం లేకుండా వీటిని భర్తీ చేస్తామని, అభ్యర్థులు ఈనెల 29న స్విమ్స్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

రేపు స్వర్ణముఖి నదీ హారతులు

● రాహుకేతు పూజలు మినహా ఆర్జిత సేవల రద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణముఖిలో నదీహారతులు సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈనెల 30న శనివారం సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖి నదీ తల్లికి కలశపూజలు, ధూప, దీప, నైవేద్యాలు, మహాదీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. కాగా నదీహారతులను పురస్కరించుకుని ఆలయంలో రాహుకేతు పూజలు మినహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల వ్యాన్ క్లీనర్‌గా చంద్రయ్య విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం ముక్కంటి ఆలయంలో సంచరిస్తూ అడ్డదారిలో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా కొందరు అభ్యంతరం చెప్పడమే కాకుండా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈవో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అడ్డదారిలో దర్శనానికి తీసుకెళ్లినట్టు గుర్తించారు. అలాగే గతంలో హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి చంద్రయ్య జైలుకు వెళ్లివచ్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు అడ్డదారిలో భక్తులను దర్శనానికి అనుమతించడంపై సస్పెండ్ చేశారు.

ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది!

● తిరుపతిలో కలకలం
● గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

తిరుపతి, (నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తనను సరిగా చూడటం లేదని ప్రియురాలే ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది. ఈ ఘటన గురువారం తిరుపతిలో కలకలం రేపింది. గంట వ్యవధిలోనే పోలీసులు నిందితులు, బాధితుడిని పట్టుకోగలిగారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన నాని తిరుపతి పెద్దకాపులేఅవుట్‌లో ఒక లాడ్జిని లీజుకు తీసుకున్నారు. ఇతడికి వివాహం కాలేదు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన భాను.. భర్త చనిపోవడంతో తిరుపతికి వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఈమె ఏడాద కిందట భానుకు పరిచయమైంది. వీరిద్దరూ కలిసి పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటున్నారు. మూడు నెలలుగా తనను సరిగా పట్టించుకోక పోవడంతో ఆగ్రహించిన భాను.. మదనపల్లె నుంచి నలుగురు రౌడీలను రప్పించింది. లాడ్జిలో ఉన్న నానిని కిడ్నాప్ చేయించి మదనపల్లెకు తీసుకెళుతున్నారు. వాహనంలో అతడిని చిత్రహింసలకు గురిచేసినట్లు సమాచారం. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, రక్షక్ బృందాలను ఎస్పీ సుబ్బరాయుడు అప్రమత్తం చేశారు. నాని మొబైల్ నెంబరు ఆధారంగా వాహనాన్ని గుర్తించారు. వాయల్పాడు వద్ద ప్రత్యేక బృందాలు వాహనం ఆపి కిడ్నాపర్లతో పాటు నానిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను, బాధితుడ్ని విచారించి జరిగిన ఘటనపై దర్యాప్తు చేయనున్నారు.

బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లు

● ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్న మంత్రి సవిత

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లను కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని మంత్రి ఎస్.సవిత అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా గురువారం తిరుచానూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో ఆ రోజుల్లోనే మహాత్మా జ్యోతిబాపూలే పోరాడారని ఆమె గుర్తు చేశారు. 70 నుంచి 80 శాతం పనులు పూర్తయిన బీసీ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను త్వరలో పూర్తి చేయనున్నామని తెలిపారు. బీసీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణను ప్రారంభించామని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి సవిత

మంచి రోజు చూసుకుని రండి

● కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టండి
● టీడీఆర్ స్కాం, భూ కబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన నేతలొద్దు
● ఇన్‌చార్జి మంత్రి అనగాని సూచన

తిరుపతి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టి, తక్కినవారిని పార్టీలో చేర్చుకునేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపినట్టు తెలిసింది. మంచి రోజు చూసుకుని పార్టీలో చేరేందుకు రావాలని సూచించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో ఇటీవల 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు వెళ్లి ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన విషయం తెలిసిందే. తిరుపతికి వచ్చినప్పుడు పార్టీలోకి చేరేందుకు సన్నాహాలు చేసుకోమని మంత్రి చెప్పిన నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. టీడీఆర్ బాండ్ల కుంభకోణం, భూకబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినట్లు తెలియవచ్చింది. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే పలువురు కార్పొరేటర్ల గురించి ఆరాతీసిందని, వారిపై సానుకూలమైన నివేదిక వచ్చిందన్న చర్చ జరిగినట్టు సమాచారం. అలాంటివాళ్లను పార్టీలోకి తీసుకునే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది.











రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు - మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ - నందమూరి మోహనకృష్ణ, రూప, నందమూరి సుహాసిని

నారావారిపల్లెలో ప్రముఖుల సందడి









సీఎం చంద్రబాబుతో టీటీడీ అదనపు ఈవో వెంకన్న చౌదరి - నారా చిన్నబ్బనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు - సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,00116 చెక్కు అందజేస్తున్న రైతులు - మంత్రి లోకేశ్‌కు వినతుల అందజేత

'గంగ' కోసం రైతుల ఎదురుచూపులు



పెన్నక్కచెరువులో తగ్గిన నీటిమట్టం

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వర్షాలు తగినంత కురవకపోవడంతో రైతులు సందిగ్ధంలో పడిపోయారు. రానున్న డిసెంబరు, జనవరి మాసాల్లో వర్షపాతం తక్కువగా ఉండవచ్చన్న అంచనాల నేపథ్యంలో వరినాట్లు వేసేందుకు రైతులు జంకుతున్నారు. ప్రధానంగా వేలాది ఎకరాల భూములు కలిగిన పెన్నక్కచెరువు ఆయకట్టు రైతులు గంగనీటి కోసం ఎదురు చూస్తున్నారు. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్కచెరువు కింద సుమారు 7వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ భూములన్నీ కోట, చిల్లకూరు మండలాల సరిహద్దున ఉన్నాయి. ఆయా రైతులంతా పెన్నక్కచెరువు నీటితోనే వరి సాగు చేస్తారు. గతేడాది కూడా ఈ చెరువు కింద వరి పుష్కలంగా పండి మంచి దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది అదునుదాటిపోతున్నా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో పెన్నక్క చెరువు ఆయకట్టు రైతులు సందిగ్ధంలో పడిపోయారు. గత నెలలో వర్షాలు వస్తాయన్న ఆశతో పెన్నక్కచెరువు కింద రైతులు ఇబ్బడిముబ్బడిగా

7 వేల ఎకరాల్లో ఆగిన వరినాట్లు

వరినాట్లు వేసేందుకు నారుమడులు పోశారు. అయితే చెరువులో తగినంత మేర నీటి నిల్వలేకపోవడం, వర్షాలు అంతంత మాత్రంగా ఉండడంతో ఈసారి వరి సాగుపై రైతులు ఆశలు వదులుకొంటున్నారు.

'గంగ'పైనే ఆశలు

ఇదిలా ఉండగా కండలేరు నుంచి ఊట్లపల్లి వరకు వచ్చే గంగనీరు, అక్కడ నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా రెండు విధాలుగా కోట మండలం గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖినదిలోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి మామిడి కాలువ, చల్లకాలువ ఎస్కేప్ చానల్ మీదుగా పెన్నక్కచెరువులోకి వెళ్లాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు గంగనీటి విడుదల విషయమై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊట్లపల్లి నుంచి 400 క్యూసెక్కుల నీటిని కోట మండలానికి స్వర్ణముఖిమీదుగా వదిలితే



వరి నారుమడులు



ఆయకట్టు భూములను దుక్కి చేసి వదిలేసిన రైతులు

పెన్నక్కచెరువు ఆయకట్టు కింద పుష్కలంగా పంటలు పండుతాయని రైతులు చెబుతున్నారు. అదే విధంగా 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి మరో మార్గమైన బూదనం, కొండుగుంటల మీదుగా మండలంలోని పలు మెట్ట గ్రామాల్లోని చెరువులకు గంగనీరు వదిలితే ఈ ఏడాది పంటలు పుష్కలంగా పండుతాయని రైతులు అంటున్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవ చూపి మండలానికి గంగనీటిని రప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గంగనీటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

కోట మండలంలో రైతులకు గంగనీటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. 400 క్యూసెక్కులు వదిలితే ఈ సారి పంటలకు సరిపోతుంది. కండలేరులో 52.69 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. నీటికి ఎలాంటి డోకా లేదు.

- శ్రీనివాసరావు, తెలుగుగంగ ఈఈ

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



హౌస్‌హోల్డ్ సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీవో గుణశేఖర్

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గుణశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని నాగవోలు, పలుగోడు, లింగసముద్రం, డక్కిలి, వెంబులూరు సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తమకు అప్పగించి పనులను సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరు లోగా ఇంటింట సర్వే పూర్తి చేయాలని చెప్పారు. వివిధ పనుల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోకుండా సకాలంలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన సిబ్బందితో కలిసి హౌస్‌హోల్డ్ సర్వేలో పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు గురువారం తెలిపారు. దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు పెళ్లకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాటుమడుగులో అనధికార విద్యుత్ కోతలు



మాటుమడుగులో కరెంటు కోసం మోటారు వద్ద ఎదురు చూస్తున్న రైతు

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటుమడుగు ఫీడర్ పరిధిలో అనధికార విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాటుమడుగు ఫీడర్ పరిధిలో నడింపల్లి, దందవోలు, శ్రీపురం గ్రామాల్లో గురువారం ఉదయం 8.30 గంటలకు త్రీ ఫేజ్ విద్యుత్ ఇచ్చారు. తరువాత గంట వ్యవధిలోనే ఐదారు సార్లు సరఫరా ఆపి మళ్లీ ఇచ్చారు. గత మూడు రోజుల నుంచి కరెంటు ఎప్పుడొస్తుందోనని మోటర్ల వద్ద పడి గాపులు కాసినా రోజుకి అర్ధ ఎకరం కూడా తడవడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ లేని కారణంగా సాగు నీరందక నిమ్మ, జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే లైన్లు ట్రిప్ అవడం వల్ల సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

వానపాములతో ఎరువుల తయారీపై శిక్షణ



ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతులకు వానపాముల ప్రాముఖ్యం, ఎరువు తయారీ, వినియోగంపై కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో పశువుల ఎరువు లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో వానపాముల సేంద్రియ ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుందన్నరు. ఎరువు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పంటల్లో వినియోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు వానపాముల ఎరువు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపాల్, నాగార్జున రెడ్డి, టీఏఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వేని పక్కాగా నిర్వహించాలి

బాలాయపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ జియో టాగింగ్ సర్వేని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నిడిగల్లు, పిగిలాం, హస్తకావేరి, జయంపు, గొట్టికాడు గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు ప్రజలకు చేరవేసేందుకు హౌస్‌హోల్డ్ జియో టాగింగ్ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందరూ తమ వివరాలను నమోదు చేయాలని సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు ఎన్‌టీటీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారి సామర్థ్యాలను అంచనా వేశారు. అలాగే పాఠశాలలో రికార్డులను, విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సంపూర్ణమ్మ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈవో మస్తానయ్య

అన్నదానం

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సాయిబాబా మందిరంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దామానెల్లూరులో గురువారం పేర్నాడు వైద్యాధికారి రమణయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీళ్ల నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. సైడ్ కాలువల్లో దోమలు చేరకుండా మందులు స్ప్రే చేశారు. వైద్య సిబ్బంది రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య, శారీరక దృఢత్వ పరీక్షలు



విద్యార్థులకు శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వస్థియ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్యాధికారిణి రేష్మా యాస్మీన్ ఆధ్వర్యంలో ఆరోగ్య, శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ విద్యార్థులకు ఎత్తు, బరువు, హెచ్‌బీ శాతం, ఛాతీ కొలతలు, దగ్గు, జలుబు వంటి వాటికి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. పరీక్షల ద్వారా విద్యార్థుల అనారోగ్య సమస్యలను నమోదు చేసుకుని వారికి వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం టీవీ వరప్రసాద్, విక్టోరియా, శారదమ్మ, ఉమా, మహేశ్వరి, శివకుమార్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే



కోటలోని బీసీ బాలుర గురుకులంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, బీఎస్పీ నాయకులు

కోట, గూడూరు అర్బన్, నాయుడుపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే అని పలువురు అన్నారు. కోట పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో గురువారం పూలే వర్ధంతి నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సరిత, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సుధాకర్, అంబేడ్కర్ ఆశయసాధన పోరాటసమితి నాయకులు రమణయ్య, విజయకుమార్, బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు, విజయకుమార్ తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కోటలో ఎస్సీ వర్గీకరణ పోరాటసమితి ఆధ్వర్యంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఆ సంస్థ ప్రతినిధులు మాధవ్, వెంకటరమణయ్య, మల్లి, అశోక్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు. ● గూడూరు పట్టణంలోని పోస్టాఫీసు సమీపంలో కులవివక్ష వ్యతిరేకపోరాట సంఘం(కేవీపీఎస్) ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. పూలే దంపతుల విగ్రహాలకు కేవీపీఎస్ అధ్యక్షుడు కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, సురేష్, వెంకటరమణయ్య నరసింహులు, చంద్రయ్య, శ్రీనివాసులు, జోగి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జైభారత్ నేషనల్ పార్టీ నేతలు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, రమణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు జ్యోతిరావుపూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. ● నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహానికి సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘ నాయకులు రామయ్య, వినుకొండ ధనంజయ, షేక్ షరీఫ్, శివ, షేక్ సులేమాన్, శివ, బాలాజీ, రాము, ముత్యాలయ్య, వినోద్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తి నాయుడికి ఎమ్మెల్యే పాశం నివాళి



సీఎం చంద్రబాబునాయుడితో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు ఉత్తర్క్రియలు గురువారం నారావారిపల్లిలో నిర్వహించారు. రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి ఎమ్మెల్యే సునీల్‌కుమార్ నివాళులర్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ



సిబ్బందిని విచారిస్తున్న ఎంపీడీవో మనోహర్ గౌడ్

చిట్టమూరు, నవంబర్ 28(ఆంధ్రజోతి): మండల పరిధిలోని మల్లాం పంచాయతీలో పనిచేస్తోన్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మస్తానయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై గురువారం విచారణ చేపట్టారు. మస్తానయ్య ఉపాధి పనుల్లో అవకతవకలు, అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో మనోహర్ గౌడ్ విచారణ చేపట్టారు. ఈయన వెంట ఏపీవో చిన్నయ్య ఉన్నారు.

జియో ట్యాగింగ్‌పై అవగాహన



జియో ట్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో కోటీశ్వరావు

వెంకటగిరిటౌన్, నవంబరు 28: మండల పరిధిలోని చెలికంపాడు, కుర్నాగుంట పంచాయతీల్లో ఎన్‌పీసీఐ, జియో ట్యాగింగ్‌పై ఎంపీడీవో కోటీశ్వరరావు గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. జియో ట్యాగింగ్‌పై సమగ్ర సర్వే నిర్వహించాలని సెక్రటరీలకు సూచించారు. కార్యక్రమంలో సచివాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలించడమే లక్ష్యంగా పనిచేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్ష జరిగింది. సీడీపీవో మునికుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనపై డిసెంబరు 12వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు

సూళ్లూరుపేట, నవంబర 28 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రాబోయే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్‌వీ నరసింహారావు సూచించారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూంకు సమాచారం అందించ వచ్చునన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి గాయాలు





ధనుంజయ (ఫైల్‌ఫొటో), గాయపడిన నాగరాజు

సూళ్లూరుపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మోటరు సైకిల్ అదుపు తప్పి కింద పడడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన ఘటన సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టు వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన నాగరాజు సీపీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతనికి దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వి.ధనుంజయ(32) స్నేహితుడు. గురువారం ఇద్దరూ కలిసి సూళ్లూరుపేటకు వెళ్లారు. అక్కడ పని ముగిశాక నాగరాజును సీసీఎల్ కంపెనీలో విడిచిపెట్టేందుకు ధనుంజయ మోటరు సైకిల్‌లో తీసుకొని వెళ్తుండగా కొణ్ణంబట్టు సమీపంలో కొత్తగా నిర్మించిన కల్వర్టు వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ధనుంజయ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు వైసీపీ హయాంలో వాలెంటీర్‌గా కూడా పనిచేశాడు. ఈయనకు భార్య, ఇద్దరూ చిన్న పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పరసా పరామర్శ

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వేలూరు హరిబాబురెడ్డిని మాజీ మంత్రి పరసారత్నం, తెలుగు మహిళా టీడీపీ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి వేర్వేరుగా గురువారం పరామర్శించారు. ఈ నెల 25న మురళీకృష్ణారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మురళీకృష్ణారెడ్డి సోదరులను టీడీపీ నేతలు పరామర్శించారు.



మురళీకృష్ణారెడ్డి, హరిబాబురెడ్డిని పరామర్శిస్తున్న పరసా రత్నం

ఎల్లి వరికి వర్షాభావం దెబ్బ

రైతుల్లో ఆందోళన



ఎల్లి పైరు

ఓజిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సాగులో ఉన్న ఎల్లి పైర్లను వర్షాభావం దెబ్బతీస్తోంది. ఓజిలి, కురుగొండ, వెంకటరెడ్డిపాళెం, మానమాల, కొండవల్లిపాడు తదితర గ్రామాల్లో సుమారు 800వంద ఎకరాల్లో రైతులు ఎల్లి పైర్లు సాగు చేశారు. ఇటీవల వరకు కురిసిన వర్షాలకు పైర్లు బాగా ఏపుగా పెరిగాయి. ఎల్లి పంట సాగు రైతులు పొలాల్లో విత్తనాలు చల్లి వర్షం కోసం ఎదురు చూస్తుండగా అక్టోబరులో అల్పపీడనం, తుపాను కారణంగా పడిన వర్షాలకు వరి మొలకెత్తి అన్నదాతల్లో ఆశలు రేపింది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, మండలంలో చెరువుల కింద సాగులో ఉన్న ఆయకట్టు భూముల రైతులు నార్లు పోసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుని ఉన్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో పెద్దగా నీరు చేరలేదు. దీంతో రైతులు నార్లు పోసుకునేందుకు వెనుకాడుతున్నారు.

తెలుగు అధ్యాపకురాలు శశికళకు సన్మానం



శశికళను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

నాయుడుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, మద్రాసు విద్యాలయం సంయుక్తంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ఈనెల 27, 28 తేదీల్లో విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య అంతర్జాతీయ తెలుగు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసవీ వసంతకుమార్ సాహిత్యంపై నాయుడుపేట మండలం పూదూరులోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో తెలుగు అధ్యాపకురాలు తన్నీరు శశికళ పేపర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆమెన సదస్సు నిర్వాహకులు విశ్వర్షి, రామమోహన్ రావు, వరప్రసాద్ తదితరులు సన్మానించారు.

జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలు



ఎంకేఎం కల్యాణ మండపం సమీపంలో జాతీయ రహదార పక్కనే పడేసిన కొబ్బరి బొండాలు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సమీపంలోని జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ కొబ్బరి బొండాలు, కుళ్లిన పండ్లు ఇతర వ్యర్థాలను పడేస్తున్నారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో ఎంకేఎం కల్యాణ మండపం, కోటపోలూరు క్రాస్ రోడ్డు వద్ద తాగేసిన కొబ్బరి బొండాలను కుప్పలు కుప్పలుగా ఎడేస్తున్నారు. అదే విధంగా చెంగాళమ్మ ఆలయ సమీపంలోని గోశాల వద్ద, వాటంబేడు రోడ్డులోనూ ఇదే పరిస్థితి. వాటంబేడు రోడ్డులో కాళంగి నది అంచునే వ్యర్థాలు వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన్న వ్యర్థాలను తొలగించాల్సిన అవసరం ఉంది.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం



రమేష్ దంపతులకు నగదు అందజేస్తున్న వెంకయ్యగౌడ్

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల యమదిన్నెపాళెం గిరిజన కాలనీకి చెందిన ఈటిపాకల రమేష్ దంపతులకు గురువారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదుకున్నారు. రెండు రోజుల క్రితం రమేష్‌కు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌కు పూర్తిగా కాలిపోయింది. కట్టుబట్టలతో బయటపడిన ఆ కుటుంబానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.10వేలు సాయం చేయగా, ఆ నగదును స్థానిక టీడీపీ నాయకుడు కొమారి వెంకయ్యగౌడ్ అందజేశారు.